
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 21 ఫిబ్రవరి 2024



'కల్యాణమస్తు, షాదీ తోఫా' పంపిణీ

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలోని 490 మంది జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫాను మంగళవారం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి రూ.4.09 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. నగరంలోని తిక్కన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, కలెక్టర్ హరినారాయణ్ లబ్ధిదారులకు మెగా చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదే ఆగ్రహం!



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు, రాజకీయ పార్టీల నాయకులు

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిపై కొనసాగుతున్న ఆందోళనలు
- రెండోరోజూ జర్నలిస్టులకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు

ఆత్మకూరు, ఫిబ్రవరి 20 : రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై వైసీపీ మూకలు చేసిన దాడిని నిరసిస్తూ రెండో రోజు మంగళవారం కూడా జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రోడ్డెక్కి నినదించారు. పాత్రికేయులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఆపలేరా!? అంటూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, యూట్యూబ్ నిర్వాహకులు భగ్గుమన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆత్మకూరులో జరిగిన భారీ ర్యాలీలో టీడీపీ, బీజేపీ, సీపీఎం, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలతోపాటు ఏబీవీపీ, పలు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కదిలొచ్చి మద్దతు ప్రకటించారు. ముందుగా బీఎస్ఆర్ సెంటర్‌లో మానవహారం నిర్మించి, ఆర్డీవో కార్యాలయం వరకు ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ జరిగిన ధర్నాలో ఏపీయూడబ్ల్యూజే నేతలు సోమా వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి, సురేష్, సీపీఎం నాయకులు కె డేవిడ్‌రాజు, ఆత్మకూరు నాగయ్య, బీజేపీ నేత కుడుముల సుధాకర్‌రెడ్డి, జనసేన నాయకుడు నలిశెట్టి శ్రీధర్, ఏబీవీపీ నాయకుడు మల్లవరపు అశోక్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ షేక్ సంధాని తదితరులు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరు ప్రాంత ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, యూట్యూబ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలంలో టీడీపీ నాయకుల నిరసన

- **వెంకటాచలం :** సాక్షాత్తు సీఎం సభలోనే ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు జరిపిన దాడి అమానుషమని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ తెలిపారు. వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయం వద్ద నాయకులు నిరసన తెలిపారు. సీఎం జగన్‌కు, వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
- **కావలి (టౌన్) :** దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ట్రంకురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ మల్లి మాట్లాడుతూ మీడియాపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు. పీసీసీ సభ్యుడు శివశేఖర్ రెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- **ఇందుకూరుపేట :** సీపీఎం మండల కన్వీనర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో యూట్యూబ్ చానళ్ల ప్రతినిధులు నల్లబ్యాడ్జీలు ధరించి, తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు.
- **బిట్రగుంట :** ఫొటో జర్నలిస్టుపై దాడిపై బోగులు మండల విలేకర్లు నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తహసీల్దారు వెంకటరత్నంకు వినతిపత్రం అందించారు. వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణయ్య, జ్యోతి శ్రీనివాసులు, శ్రీనివాసులు, యజ్ఞ, సుబ్బరాయుడు, దిలీప్, జీవన్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.



కావలిలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నేతలు



బిట్రగుంట : తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తూ..

కందుకూరు వైసీపీలో గందరగోళం



- మహీధరరెడ్డిని దూరం పెడుతున్న అధిష్ఠానం
- ఎమ్మెల్సీ తూమాటికి సీఎంవో నుంచి పిలుపు
- కందుకూరు బాధ్యతలు చూడాలని జగన్ సూచన

కందుకూరు, ఫిబ్రవరి 20 : కందుకూరు వైసీపీలో గందరగోళం కొనసాగుతోంది. సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డిని పూర్తిగా పక్కన పెట్టడమే లక్ష్యంగా ఆ పార్టీ అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నెల 16వ తేదీన ఆదిశంకర విద్యాసంస్థల అధినేత వంకి పెంచలయ్య పెద్ద కుమార్తె కఠారి అరవిందను కందుకూరు పార్టీ ఇన్చార్జిగా నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. అభ్యర్థిని ప్రకటించాక సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని పిలవని జగన్ కందుకూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును మాత్రం సోమవారం పిలిపించుకుని మాట్లాడారు. సీఎంఓ నుంచి వచ్చిన పిలుపుమేరకు సోమవారం సాయంత్రం మాధవరావు జగన్‌ను కలవగా 15 నిమిషాలకుపైగా ఆయనతో చర్చించిన జగన్ కందుకూరులో అరవిందను గెలిపించడమే లక్ష్యంగా బాధ్యతతో పని చేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మహీధరరెడ్డి రాజకీయ అడుగులపైన, ఆయనకున్న బలమైన వర్గం, నేపథ్యం తదితర అంశాలను వివరిస్తూ పలు సందేహాలు వ్యక్తం చేయగా జగన్ వాటిన్నిటినీ తేలిగ్గా కొట్టిపారేసినట్లు విశ్వసనీయ సమాచారం. మన అభ్యర్థి అరవింద అందులో ఎలాంటి మార్పు ఉండబోదు. ఆమె విజయానికి కృషి చేసే బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేసినట్లు సమాచారం.

● అనుచరుల్లో ఆగ్రహం

కాగా, నియోజకవర్గంలో అనేక మందికి పెంచలయ్య ఫోన్లు చేసి మాట్లాడుతుండటమే గాక ఇక్కడ పార్టీ కార్యాలయం కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. ఈ విషయాల్లో సిటింగ్ ఎమ్మెల్యేపై ఏమాత్రం ఆధారపడకుండా పనులు చేసుకుంటుండటం అభ్యర్థి ప్రకటన జరిగాక ఆయన్ను కలవకపోవటం మరోవైపు సీఎం జగన్ ఎమ్మెల్సీ మాధవరావును పిలిపించుకుని మాట్లాడటం వైసీపీ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది. జరుగుతున్న పరిణామాలతో ఎమ్మెల్యే అనుచరులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. రాజకీయంగా ఏదైనా నిర్ణయం తీసుకోవాలన్న కోణంలో వారు మహీధరరెడ్డిపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. పార్టీ పెద్దలు తనపట్ల అనుసరిస్తున్న విధానాన్ని అవమానకరంగా భావిస్తున్న ఆయన గుంభనంగా రాజకీయ అడుగులు వేస్తున్నారని భావిస్తున్నారు.

వ్యవసాయ సర్వీసులకు రిజిస్టర్ చేసుకోండి

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 20 : జిల్లాలోని రైతులు వ్యవసాయ సర్వీసులకు స్థానిక సచివాలయాలలో ఉన్న జగనన్న రైతునేస్తంలో రిజిస్టర్ చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇక నుంచి రైతులందరూ జగనన్న రైతునేస్తం పోర్టల్ ద్వారా వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దీంతో రైతులకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం ఉండదన్నారు. అలాగే పీఎం సూర్యఘర్ మస్ట్ బిజిలీ యోజన ద్వారా 150 యూనిట్ల గృహవినియోగం ఉన్న వారికి ఒకటి నుంచి రెండు కిలో వాట్స్ వరకు సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్‌ను సబ్సిడీతో అందించనున్నట్లు చెప్పారు. దీనిని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూమేగా

కబ్జా చేస్తేపోలా!?

నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూమి అది. సుమారు రూ.10 కోట్ల విలువైన ఈ భూమిపై కొంతమంది కళ్లు పడ్డాయి. అధికార దర్పమే పెట్టుబడిగా పైసా ఖర్చు లేకుండా కబ్జా చేసి ప్లాట్ల రూపంలో జనం నెత్తిన అంటగట్టడానికి రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం నుడా అధికారుల ముందు ఉంది. అన్నీ సవ్యంగా జరిగితే అంటే అధికారులంతా కళ్లుమూసుకుంటే మరో నాలుగైదు రోజుల్లో ఈ ప్రభుత్వ భూమి పరాధీనం కావడం తథ్యం.

- నెల్లూరు రూరల్‌లో బరితెగిస్తున్న అక్రమార్కులు
- రూ.10 కోట్ల ప్రభుత్వ భూమి స్వాహాకు యత్నం
- పట్టా భూమిని కలుపుకొని ఎంచక్కా లేఅవుట్
- అధికార పార్టీ నేత కనుసన్నల్లోనే అంతా
- అప్రూవల్ కోసం నుడాకు చేరిన ఫైల్


నెల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అంబాపురంలో ప్రభుత్వ భూమిని ఇళ్ల ప్లాట్ల కింద విక్రయించడానికి అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు స్కెచ్ వేశాడు. అనుకున్నదే తడవుగా పక్కనున్న పట్టా భూమిని కొనుగోలు చేశాడు. సుమారు 20 ఎకరాల లే అవుట్‌లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కలుపుకొని ప్లాట్లు వేశాడు. సర్వే నెం.79-1, 2, 3, 16, 18, 21లలో, 80-1, 81-17, 19లలో 2.87 ఎకరాల గయాళ్లు పోరంబోకు ఉంది. అలాగే 77, 78, 80 సర్వే నంబర్లలో 21 సెంట్ల దిబ్బ పోరంబోకు ఉంది. మొత్తం ఈ మూడెకరాల ప్రభుత్వ భూమిని పట్టా భూమిలో కలుపుకొని లే అవుట్ వేశాడు.


● లే అవుట్ల ముసుగులో..

ఆ.. మొత్తం మూడెకరాలే కదా! ఇదేమంత గొప్ప విషయం అనుకుంటే పొరబాటే. మార్కెట్ విలువ ప్రకారం ఈ ప్రాంతంలో ఎకరం ధర రూ.3 కోట్లు పలుకుతోంది. ఈ లెక్కన పట్టా భూముల ముసుగులో కొట్టేయడానికి ప్రయత్నిస్తున్న మూడెకరాల ప్రభుత్వ భూమి విలువ రమారమి 10 కోట్ల రూపాయలు. నగర పరిసరాల్లో ఇలా లే అవుట్ల ముసుగులో ప్రభుత్వ భూములను కొట్టేయడం పరిపాటిగా మారింది. ఒకటి రెండు ఘటనలపై ఫిర్యాదులు, కోర్టు కేసుల వరకు వెళ్లినా అధికారులు చేతులు ముడుచుకొని కూర్చోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోయి ప్రభుత్వ భూముల కబ్జాకు తెగపడుతున్నారు. విలువైన ప్రభుత్వ భూములు హారతి కర్పూరం అవుతున్నాయి.

● చకచక కదులుతున్న ఫైలు

ప్రస్తుతం ఈ లే అవుట్‌కు సంబంధించిన ఫైలు అప్రూవల్ కోసం నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) కార్యాలయానికి చేరిందని సమాచారం. అధికార బలంతో నుడా అధికారులు కళ్లు మూసుకొని అప్రూవల్ ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. సాధారణంగా ఒక లే అవుట్ మధ్యలో ప్రభుత్వ భూమి ఉంటే ఆ భూమిని మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వం నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే భూమి కొనుగోలుకు సంబంధించిన ఫైలు అనుమతి కోసం కలెక్టర్ ముందు ఉంచాలి. కలెక్టర్ అనుమతి మేరకు మార్కెట్ రేటు ప్రభుత్వానికి చెల్లించిన తరువాతే ఆ భూమిపై హక్కు లభిస్తుంది. అప్పుడే నుడా అప్రూవల్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇలాంటివేవి జరగకుండా, సదరు లే అవుట్‌లో ప్రభుత్వ భూమి ఉందన్న విషయాన్ని కూడా బట్టబయలు కానివ్వకుండా చడీచప్పుడు లేకుండా నుడా అప్రువల్ తెచ్చుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఇదే జరిగితే రూ. పది కోట్ల ప్రభుత్వ భూమి పరులపాలవుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు తక్షణం స్పందించి లే అవుట్‌లోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, లేదా చట్టబద్ధంగా విక్రయించాలని స్థానికులు కోరుకుంటున్నారు.





ప్రభుత్వ భూమిని కలుపుకుని వేసిన వేసిన లేఅవుట్ (ఇన్‌సెట్) నుడాకు అందజేసిన మ్యాప్

సమరం



తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంగళవారం నెల్లూరులో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు భారీ ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

- ఏపీజేఏసీ వైస్ చైర్మన్ శోభన్‌బాబు
- నెల్లూరులో ఉద్యోగ, ఉపాధ్యాయుల భారీ ర్యాలీ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 20 : ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఏపీజేఏసీ వైస్‌చైర్మన్, రాష్ట్ర ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శోభన్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సర్వోదయా కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ జరిగిన సభలో శోభన్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులకు ఇచ్చిన మాటను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, తమకు న్యాయంగా రావాల్సిన జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ డబ్బులు వెంటనే మంజూరు చేయాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులు చెల్లించాలని, పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఇవ్వాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్‌ఉద్యోగులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ నిరసనలో ఏపీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, ఏపీ ట్రెజరీ ఉద్యోగుల సంఘం నేతలు కిరణ్‌కుమార్, దేవిరెడ్డి రమణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు, ఆర్టీసీ నాయకుడు లూక్సన్, ఉపాధ్యాయ సంఘం నాయకులు సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు, వెంకటశేషులు, శర్మ, దశరథరామయ్య, హజరత్తయ్య, పెన్షనర్ల సంఘం నాయకులు గౌస్, ఖాసీం, నరసింహాచారి, ఫార్మసిస్టు సంఘం నాయకులు శ్రీనివాసులు, కృష్ణకుమార్, సువర్ణ సందీప్, కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు!

- జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ) : రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. మరమ్మతుకు గురైన మోటార్లను బాగుచేయించాలని, వీలైతే అదనపు మోటార్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే విద్యుత్ వాడకంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో హుండీల చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

సంగం, ఫిబ్రవరి 20: మండలంలోని సిద్దీపురం పంచాయతీ మజరా గ్రామమైన అనసూయనగర్‌లోని రెండు ఆలయాల్లో హుండీలను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీ చేసి అందులోని నగదు తీసుకెళ్లారు. ఈమేరకు గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం వినాయక గుడి, రామాలయంలో పూజల అనంతరం పూజారి తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం పూజారి పూజ చేయడానికి రాగా గేటు తాళాలు పగలకొట్టిన విషయం గుర్తించారు. ఆలయంలో పరిశీలించగా హుండీలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. వారు వచ్చి చుట్టూ పరిశీలించగా పొలాల్లో ఒక హుండీ పగలకొట్టి ఉంది. అందులో నోట్లు తీసుకుని చిల్లర అక్కడే వదిలేసి దుండగులు వెళ్లిపోయారు. వినాయక గుడి హుండీ కనిపించలేదు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. హుండీల్లో రూ. 10 నుండి 15 వేల నగదు ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. అనంతరం క్లూస్ టీమ్‌కు సమాచారం అందచేయడంతో వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కొండాపురం, ఫిబ్రవరి 20: పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై ఖాజావలి కథనం మేరకు, గానుగపెంట, సత్యవోలు గ్రామాల పరిధిలోని అటవీప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలసి దాడిచేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురు పేకాటరాయుళ్లతోపాటు రూ.20,500 నగదు సీజ్ చేసినట్లు చెప్పారు. పేకాటరాయుళ్లు లింగసముద్రం మండలం పెద్దపవని, చిన్నపవని గ్రామాలకు చెందినవారిగా గుర్తించామని, వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పొదలకూరు, ఫిబ్రవరి 20 : మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన నారాయణమ్మ అనే మహిళ మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును మంగళవారం సాయంత్రం దుండగులు లాక్కెళ్లారు. పర్వతాపురం గ్రామానికి చెందిన నారాయణమ్మ సొంత పనిపై పులికల్లు గ్రామానికి వెళ్లి అక్కడ నుంచి తిరిగి గ్రామానికి నడిచివెళ్తుండగా వెనుకనే బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఆమె ఫిర్యాదు మేరకు కండలేరు డ్యాం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

సీతారామపురం, ఫిబ్రవరి 20 : విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించిన సీతారామపురం ఏపీ మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు రవికుమార్‌పై ప్రిన్సిపాల్ రెహమాన్ మంగళవారం సీతారామపురం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై అనూష కేసు నమోదు చేశారు.

హరనాథపురంలో నగలు, నగదు చోరీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 20: నెల్లూరులోని హరనాథపురం రెండో వీధిలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. హరనాథపురం రెండో వీధిలో మునికృష్ణయ్య, మంజుల దంపతులు నివాసం ఉంటున్నారు. వీరు తమ కుమారుడి వివాహ నిశ్చితార్థం కోసం ఈ నెల 17వ తేది రాత్రి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి గ్రిల్స్‌కు ఉన్న తాళం పగులగొట్టి లోపలకి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులోని రూ.50 వేలు, శ్యామ్‌సంగ్‌ఫోన్, 68 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. మంగళవారం ఉదయం మునికృష్ణయ్య కుటుంబం హైదరాబద్ నుంచి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో బీరువాలో పరిశీలించగా నగదు, బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ మేరకు బాధితురాలు మంజుల బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎల్ వీరానాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డబుల్ ఎంట్రీలపై చర్యలు : కమిషనర్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 20 : నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలపై చర్యలు తీసుకుంటామని ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ తెలిపారు. మంగళవారం కార్పొరేషన్‌లోని తన చాంబరులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎక్కువుగా ఉన్న డబుల్ ఎంట్రీలపై చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో బీఎల్వోలు సమర్థవంతంగా పని చేయడం లేదని వాపోయారు. వారి తప్పిదాల వల్ల నాణ్యతలోపంగా జాబితా తయారవుతుందని చెప్పారు. దీనిపై స్పందించిన ఆయన ఆ మేరకు దరఖాస్తులు తమకు అందచేస్తే క్షుణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	146
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	284
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5915
వెండి కిలో ధర	రూ. 73,400
వెండి ఒక గ్రాము	రూ. 75.40

ఇళ్ల స్థలాలు అందక ఇక్కట్లు



ఇళ్ల స్థలాలకోసం శ్మశాన స్థలంలో చదును చేసిన భూమి

- పక్క గ్రామంలో ఇచ్చారని పట్టాలు తిరిగి ఇచ్చేసిన లబ్ధిదారులు
- రెండేళ్లకుపైగా ఎదురుచూపులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 20 : బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు గ్రామానికి చెందిన సుమారు 100 కుటుంబాలవారు ఇళ్ల స్థలాలకోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి పక్కగ్రామాలయిన రామచంద్రాపురం, కట్టుబడిపాళెం, పురంధరపురం లోని జగనన్న లేఅవుట్లో ఇళ్ల స్థలాలు కేటాయించి, పట్టాలు కూడా మంజూరు చేశారు. కానీ ఆ స్థలా లు కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్నాయి. 15 మంది మాత్రమే స్థలాలు ఇచ్చినచోట ఇళ్లు కట్టుకున్నారు. మిగిలిన 85మంది అక్కడ వద్దంటూ పట్టాలను తిరిగి ఇచ్చేశారు. ఇది జరిగి సుమారు రెండేళ్లు కావస్తున్నది. కానీ ఇంతవరకు నేతలు, అధికారులు పట్టించుకోలేదు.

● పోరంబోకు స్థలం చదును

లబ్ధిదారుల్లో ఆశలు రేపుతూ వవ్వేరు శివారులోని శ్మశానానికి సమీపంలోని పోరంబోకు స్థలాన్ని జగనన్న లేఔట్ పేరుతో చదును చేశారు. అక్కడ స్థలాలు తీసుకునేందుకు కొంతమంది సమ్మతించగా, ఇంకొందరు పక్కనే శ్మశానం ఉందని అభ్యంతరం చేశారు. దీనికితోడు ఆ భూమి కనిగిరి రిజర్వాయర్ పోరంబోకు కావడంతో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయదని తెలుసుకుని మరికొందరు మిన్నకుండిపోయారు. మిగిలిన వారు స్థలాల కోసం నేటికి ఎదురు చూస్తున్నారు.

వేరేచోట ఇస్తామని పట్టాలు తీసుకున్నారు...



రామచంద్రాపురంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. కిలోమీటరు దూరంలో ఉందని అక్కడ వద్దన్నాం. వేరే చోట స్థలాలు ఇస్తామని పట్టాలు వాపసు తీసుకున్నారు. నేటికీ ఆ ఊసే లేదు.

\- షేక్ సైదం, గృహిణి, వవ్వేరు

పాత స్థలాలే రిజిస్ట్రేషన్ చేయిస్తామంటే వద్దన్నాం..



మాకు మూడేళ్లక్రితం రామచంద్రాపురంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అక్కడ వద్దన్నాం, ఇంకెక్కడైనా ఇవ్వమని కోరాం. మంగలికట్టలో ఇస్తామన్నారు. అక్కడా ఇవ్వలేదు. ఇప్పుడు మొదట ఇచ్చిన స్థలాన్నే రిజిస్ట్రేషన్ చేయిస్తామంటుంటే వద్దని చెప్పాం.

\-మర్రి జయంతి, గృహిణి, వవ్వేరు

దూరంగా వద్దంటే.. పట్టాలు తీసేసుకున్నారు !



మాకు రామచంద్రాపురంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అక్కడ వద్దంటే వేరే చోట ఇస్తామని చెప్పి ఇచ్చిన పట్టాలు తిరిగి తీసుకున్నారు. ఇంత వరకు మరోచోట ఇవ్వలేదు. స్థలాల కోసం ఎదురు చూస్తున్నాం.

\-వవ్వేరు శీనమ్మ, దివ్యాంగురాలు, వవ్వేరు

పెన్షనర్ల సమస్యలపై మహాధర్నా చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 20 : పెన్షన్‌దారుల సమస్యలకు పరిష్కారం కోసం చేపట్టే సాధారణ నిరసనలకు ప్రభుత్వం స్పందించడంలేదని, మహాధర్నా చేయాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం భక్తవత్సలనగర్‌లోని పెన్షన్ భవన్‌లో జరిగిన పెన్షనర్ల సర్వసభ్య సమావేశం, మెగా వైద్య శిబిరం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పెన్షనర్స్ దీర్ఘకాలిక సమస్యలు సాధించుకోవాలంటే అంగన్‌వాడీ కార్యకర్తల్లా మహాధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు పెన్షనర్స్ అందరూ సిద్ధం కావాలని కోరారు. ఉపాధ్యాయ ఉద్యమనేత పీ.బాబురెడ్డి మాట్లాడుతూ పింఛన్‌దారులు, ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ నగరంలో ఎనెల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిచే మెగా వైద్య శిబిరం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఎనెల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నాగేంద్రప్రసాద్, పీ.హరికృష్ణ, గిరి, మహేష్, తదితరులను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు ఎస్ఎం.గౌస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాలను కార్యదర్శి ఎస్‌పీవీఎన్. ప్రసాద్, కోశాధికారి జే.హజరత్తయ్య, తదితరులు పర్యవేక్షించారు

ఎస్సీలను దగా చేస్తున్న జగన్

- పరిశ్రమల కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్సీ మోర్చా నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 20: వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం పేరుతో ఎస్సీలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మోసం చేస్తున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా నేతలు ఆరోపించారు. ఈ మేరకు.. మంగళవారం నగరంలోని జిల్లా పరిశ్రమల కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ మాట్లాడుతూ మూడేళ్లుగా వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం లబ్ధిదా రులకు సబ్సిడీ నిధులు విడుదల చేయలేదన్నారు. కేంద్రప్రభుత్వం ప్రతి ఏటా ఇస్తున్న ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో మూడు దశాబ్దాలుగా అంధ్రప్రదేశ్‌లో ఎస్ఎస్ఎఫ్‌డీసీ, ఎస్ఎస్‌కే ఎఫ్‌డీసీ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు 25 రకాల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా అమలవుతున్న 25 రకాల సంక్షేమ పథకాలను రద్దుచేసి షెడ్యూల్ కులాల వారి ఆర్థిక మూలాలను దెబ్బతీసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు, నాయకులు పరుసు మధు, మల్లి రవి, ఎర్రబోలు రాజేష్, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

వేదగిరిపై భీష్మ ఏకాదశి వేడుకలు



లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న భక్తులు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 20 : వేదగిరి క్షేత్రంలో మంగళవారం భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష తులసి పూజ వైభవంగా జరిగింది. కాగా ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీల సమేతంగా వేదగిరీశుడుకి కల్యాణ మహోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోశ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ ఈ ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చి గిరి ప్రదక్షణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈవో గిరికృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సన్నాహాలు

- ప్రశాంతంగా ముగిసిన ప్రాక్టికల్స్
- నేటి నుంచి హాల్‌టికెట్ల పంపిణీ



చివరిరోజున ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 20 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు సన్నాహాలు వేగవంతం చేశామని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారం పూర్తయిన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు బుధవారం నుంచి నుంచి కళాశాల లాగిన్ల హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయని హాజరు శాతంతో నిమిత్తం లేకుండా విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేయాలని సూచించారు. హాజరు నెపం, ఫీజులు చెల్లించలేదన్న కారణాలతో హాల్‌టికెట్లు నిరాకరిస్తే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 25వతేదీ తరువాత హాల్‌టికెట్లు పబ్లిక్ డొమైన్లలో లభ్యమవుతాయని, ప్రిన్సిపాల్ సంతకం లేకుండానే డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు. కాగా, ఈ నెల 3వతేదీ నిర్వహించాల్సిన పర్యావరణ విద్య పరీక్షను 23న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే సమగ్రశిక్ష, ఇంటర్‌బోర్డుల ఆధ్వర్యంలో ఒకేషనల్ ట్రేడ్ పరీక్షలను ఈ నెల 22న జిల్లాలోని 13 కళాశాలల్లో జరుగుతాయన్నారు. ఇంటర్ రెగ్యులర్ పరీక్షలకు సంబంధించి సిబ్బంది నియామకాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర సదుపాయాలపై ఈ నెల 24న నగరంలోని దర్గామిట్ట డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

● వెల్‌నెస్ బృందాల ఏర్పాటు

విద్యార్థుల్లో మానసిక, శారీరక ఒత్తిళ్లను తొలగించి ఆరోగ్యకరమైన జీవన నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో అన్ని జూనియర్ కళాశాలల్లో స్కూల్ వెల్‌నెస్ టీమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్ఐవో తెలిపారు. టీమ్ లీడర్‌గా ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్‌గా అధ్యాపకుడు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రతి తరగతి గదిలో ఒక విద్యార్థి సభ్యులుగా ఉంటారని అన్నారు. అలాగే 18 సంవత్సరాలు దాటిన విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేయడంతోపాటు ఓటు ప్రాముఖ్యతను తెలియచేసేందుకు ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్‌లను కళాశాలల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

'పది' ప్రీ ఫైనల్స్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 23 నుంచి పాఠశాలల్లో నిర్వహణ
- ఎస్‌సీఈఆర్టీ ద్వారా ప్రశ్నపత్రాలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 20 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలకు, 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఎఫ్ఏ-4 పరీక్షలను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పదవ తరగతి విద్యార్థులకు ఈనెల 23 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే ప్రీ ఫైనల్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఎంఆర్‌సీలకు పంపించి అక్కడ నుంచి సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు తీసుకెళ్లి పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు డీఈవో రామారావు తెలిపారు. అదేవిధంగా ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు 1 నుంచి 9వ తరగతి విద్యార్థుల జరిగే పరీక్షలకు ఎస్‌సీఈఆర్టీ ఆన్‌లైన్‌లో ఏరోజుకారోజు జిల్లా విద్యాశాఖకు ప్రశ్నాపత్రాలను పంపించనుంది. విద్యాశాఖ డీఈవో నెల్లూరు డాట్ 50 వెబ్ డాట్ కామ్ ద్వారా, లేక జిల్లాలోని అన్ని విద్యాశాఖ వాట్సాప్ గ్రూపుల ద్వారా పాఠశాలలకు ప్రశ్నాపత్రాలను పంపించనున్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు ప్రశ్నాపత్రాలను ప్రింట్ చేయించడం లేక ఐఎఫ్‌పీ ఉపయోగించి డిక్టేట్ చేయడం ద్వారా తరగతి గదిలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పరీక్షలన్నీ కూడా అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొన్న విధంగా ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి ఇచ్చిన సిలబస్‌తోనే ప్రశ్నలు ఉంటాయని డీఈవో పేర్కొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ప్రారంభం

వెంకటాచలం, ఫిబ్రవరి 20 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో మంగళవారం నుండి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఒకటవ సెమిస్టర్ పరీక్షలకు 513 మంది గైర్హాజరైనట్లు యూనివర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి తెలిపారు. అలాగే జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు ఆమె పేర్కొన్నారు.

రామతీర్థంలో కోడిపందేలు

- నేడు నిర్వహణకు సర్వం సిద్ధం
- రూ. లక్షల్లో బెట్టింగులు
- వివిధ ప్రాంతాల నుంచి పందెపురాయుళ్ల రాక

విడవలూరు, ఫిబ్రవరి 20: ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం పేకాట, కోడి పందేలకు నిలయంగా మారింది. అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. రామతీర్థంలో జరుగుతున్న జూదాలపై ఫిర్యాదులు అందినా పోలీసులు మౌనముద్ర పాటిస్తున్నారేతప్ప ఎప్పుడూ కూడా దాడులు చేసిన దాఖలాలు లేవు. పోలీసులు నెల మామూళ్లు తీసుకుం టున్నారో.. లేదో... అధికార పార్టీ నాయకుల బెదిరింపు లకు భయపడుతున్నారో తెలియదుకాని జూదాలకు లైసెన్సు ఇచ్చేశారు.



నేడు పందేల నిర్వహణ?

గ్రామంలోని రామలింగాపురం ప్రాంతంలో బుధవారం కోడిపందేలను నిర్వహించేందుకు కొంతమంది వ్యక్తులు సర్వం సిద్ధం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు వేయిమంది కూర్చోని తిలకించేందుకు వీలుగా కుర్చీలతోపాటు పదుల సంఖ్యలో బరులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ పందేలకు జిల్లా నలుమూల నుంచే కాక తమిళనాడు, విజయవాడ, ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూడా పందెంరాయుళ్లు వస్తున్నట్లు సమాచారం. దీంతో పందేలు రూ. లక్షల్లో జరిగే అవకాశాలు ఉన్నట్లు ప్రజలు అంటున్నారు.

● పోలీసులకు ముందస్తు సమాచారం ?

రామతీర్థంలో భారీ ఎత్తున జరగనున్న కోడిపందేలపై పోలీసు ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం ఉందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వారిపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకుని వచ్చి కోడిపందేలను నిర్వహిస్తున్నారని, లేనిపక్షంలో ఇంత భారీగా పందేలను నిర్వహించేందు ఏర్పాట్లు జరగవని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ పందేలపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రామతీర్థంలో కోడి పందేలు జరుగుతున్నట్లు ముందస్తు సమాచారం లేదు. అయినా పందేలు నిర్వహిస్తే మాత్రం సహించం.

\- ఎస్ఐ రాజా

కోవూరుపల్లి పీహెచ్‌సీలో కనీస వసతుల కరువు

● తాగునీటి కోసం వాటర్‌క్యాన్ల కొనుగోలు ● సౌకర్యాలు లేకున్నా నోరుమెదపని వైద్య సిబ్బంది


పనిచేయని మినీ వాటర్ ప్యూరిఫైర్


ఉపయోగంలో లేని మరుగు దొడ్డి

బిట్రగుంట, ఫిబ్రవరి 20 : బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీ 24 గంటల ఆసుపత్రి అయినా కనీస వసతులు కరువయ్యాయి. వైద్యశాలలో ఏర్పాటుచేసిన మినీ వాటర్ ప్యూరిఫైర్ ఆరు నెలలుగా మరమ్మతుకు గురి కావడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సిబ్బంది ఇళ్ల వద్ద నుంచి వాటర్ బాటళ్లు తీసుకొచ్చుకుంటున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల కోసం వైద్యాధికారులు వాటర్ క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. నెల క్రితం నుంచి విద్యుత్ మోటారు మొరాయించడంతో ఆసుపత్రిలో పనిచేసే మహిళా సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు.ఇకపోతే పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నామమాత్రంగా ఉన్నాయని గ్రామ పెద్దలు అంటున్నారు. ఇటీవల స్థానికులు బీపీ, షుగర్ చెక్ చేయించుకునేందుకు వెళ్లిన సమయంలో సిబ్బంది ఎవరూ లేరని ఆవేదన చెందారు. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సును ఎక్కడికి పోయిందని అడగ్గా నైట్‌డ్యూటీ చేసిన ఆ మహిళ వాష్‌రూముకు వెళ్లానని పేర్కొంది. కోవూరుపల్లి పీహెచ్‌సీ జాతీయ రహదారికి సమీపంలో ఉన్నా కనీస వసతులు లేకపోవడం సిగ్గుచేటని గ్రామస్థులు అంటున్నారు. నిత్యం వైద్యశాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఉన్నతాధికారులకు ఈ సమస్యలు కనిపించవా...? అని గ్రామ పెద్దలు అంటున్నారు. ఇన్‌చార్జిగా అల్లూరు మండలం ఇస్కపల్లి చెందిన వైద్యుడు ఉండటంతో చాలా వరకు సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిసింది. ప్రజల ఆరోగ్యం కోసం రూ. కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం


పోలేరమ్మకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

సంగం, ఫిబ్రవరి 20: మండలంలోని మక్తాపురంలోని పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జండామాను నుంచి మహిళలు కలశాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకుని పోలేరమ్మ మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. పొంగళ్లు పొంగిచి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆత్మకూరు అభివృద్ధికి కృషి


సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 20: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల అభివృద్ధికి సమిష్టిగా పనిచేస్తామని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లాలా తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని 9వ వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, వైసీపీ నాయకుడు కొప్పోలు చిన్నపురెడ్డి, మున్సిపల్ ఏఈ జూపల్లి ప్రసాద్, ఆర్‌ఐ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


రోగులకు మందులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 20: మండలంలోని తూర్పు కొండారెడ్డిపల్లిలో మంగళవారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్, టీడీపీ నియోజకవర్గ నాయకులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సంజీవని ఆరోగ్యరథం ద్వారా వైద్యులు రోగులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యరగూటి మాలకొండారెడ్డి, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాముడూరులో...

చేజర్ల: మండలంలోని మాముడూరు గ్రామంలో మంగళవారం నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈ రమాదేవి రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 20: మండలంలోని భైరవరం గ్రామంలో మంగళవారం మారెడ్డి కొండమ్మకు చెందిన పొగాకు బ్యారన్ ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఉదయగిరి అగ్నిమాపక కేంద్రం వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

వలంటీర్లకు పురస్కారాలు

సీతారామపురం, ఫిబ్రవరి 20: మండలంలోని 9 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో వాలంటీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, పాల్గొన్నారు.

రైల్వే విశ్రాంత ఉద్యోగులకు మజ్దూరు యునియన్ అండ

బిట్రగుంట, ఫిబ్రవరి 20: రైల్వే విశ్రాంత ఉద్యోగులకు సౌత్‌సెంట్రల్ మజ్దూరు యునియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కార్మిక నాయకుడు సుబ్బారావు అన్నారు. బోగోలు పంచాయతీ సమావేశ మందిరంలో ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ సంక్షేమ సమాఖ్య సమావేశం మంగళవారం జరిగింది. రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సుధాకర్, కృపయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ విజయవాడ డివిజనల్ అధ్యక్షుడు రామ్‌గోపాల్, కార్యదర్శి కామేశ్వరావు, బ్యాంకు మేనేజర్లు దివ్య, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

బాబు సీఎం అయితేనే ఎయిర్‌పోర్టు,

ఫిషింగ్ హార్బర్ పూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న కావ్య కృష్ణారెడ్డి

బిట్రగుంట, ఫిబ్రవరి 20: టీడీపీ ప్రభుత్వంలోనే దగదర్తిలో ఎయిర్‌పోర్టు, జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్, రామాయపట్నంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారని, చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే వాటి ప్రారంభోత్సవాలు జరుగుతాయని కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. బోగోలులో మంగళవారం సాయంత్రం పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో కార్యకర్తల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ కావలి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు బొమ్మిసురేంద్ర, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, జిల్లా నాయకులు బీద గిరిధర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, తప్పుడు కేసులు బనాయించడం వంటివి పెరిగిపోయాయన్నారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న వారిపై దాడులు, వేధింపులు పెరిగాయని మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. ఆప్కాబ్ మాజీ నేత కోడూరు పాలిశెట్టి తదితరులు మాట్లాడారు. అంతకుముందు ఇబ్రహీంపేట నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, లక్కాకుల మాధవరావు, రావి విజయ్‌కుమార్‌యాదవ్, కోటా వెంకారెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, కుందుర్తి వెంకటవరప్రసాద్, కాంద్రంఘురామ్‌నాయుడు తదితరులు ఉన్నారు.

వెంగమాంబ సన్నిధిలో వేలం పాటలు


వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 20: మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ అంశాలపై వేలం పాటలు నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నెల్లూరు డివిజన్ పరిశీలకుడు సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో, ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్ల సమక్షంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ టెండర్లు, వేలంపాటలు నిర్వహించారు. వేలంపాటల్లో పాటదారులు వివిధ అంశాలకు సంబంధించి రూ.16,48,000కు పాడారు. గతేడాది కంటే ఈ ఏడాది వేలంపాటల ద్వారా ఆదాయం పెరిగిందని అధికారులు తెలిపారు. అలాగే కూరగాయలు, పూలు, అమ్మవారి అభిషేక సామాగ్రి తదితర వాటికి సంబంధించి టెండర్లు నిర్వహించారు. తక్కువ నమోదు చేసిన టెండర్లను దేవదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులకు పంపినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు బెల్లంకొండ పెద్దభద్రయ్య, పాటదారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

చేజర్ల, ఫిబ్రవరి 20 : మండలంలోని పలు గ్రామాలలో రైతులు పండిస్తున్న వరి, జొన్న, మిరప తదితర పంటలను మంగళవారం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మి, పొదలకూరు ఏడీఏ శివనాయక్, మండల వ్యవసాయశాఖ అధికారి వి శశిధర్ పరిశీలించారు. వరి, మిరప పంటలకు సోకిన తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఏవో వాసు, కెవికే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, విఏఏ మాధురి, రైతులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత


సిబ్బందితో సమీక్షిస్తున్న సబ్ డీఎఫ్‌వో

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 20: అడవుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కావలి సబ్ డీఎఫ్‌వో పీ రాజశేఖర్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక అటవీ శాఖా రేంజ్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని అడవులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వన్యప్రాణులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రేంజ్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వనసంరక్షణ సమితుల్లో నరికిన జామాయిల్ వివరాలను తెలుసుకున్నారు. ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, డీఆర్వో శ్రీనివాసులు, ఎఫ్ఎస్‌వోలు బోగ్యం శ్రీనివాసులు, షేక్ మునీర్, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

సీతారామపురం, ఫిబ్రవరి 20 : మండలంలోని 14 పంచాయతీల్లో 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 7.4 కోట్లతో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై మంగళ వారం స్థానిక స్త్రీశక్తి భవనం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా సోషల్ ఆడిట్ బృందాలు ఉపాధి హామీ పథకంలో పాల్గొన్న కూలీలను, చేసిన పనులను క్షేత్రస్థాయిలో విచారించారు. మొత్తం 14 పంచాయతీల్లో పనులు జరగగా సుమారు. రూ. 81322 మేర అక్రమాలు జరిగాయని సమావేశం దృష్టికి తెచ్చారు. విచారించిన అధికారులు సంబంధిత సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకట్రావు, ఏపీడీ గాయత్రీదేవి, అంబుడ్స్‌మెన్ వెంకట్రామిరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ సీఈవో వేణుగోపాల్, ఎంపీడీవో, ఏపీవో సుభాషిణి, ఇసి సువర్ధయ్య, టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

వెలుగొండ జలాలతో ఉదయగిరి సస్యశ్యామం

ఉదయగిరి, ఫిబ్రవరి 20: ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలు సస్యశ్యామలం కావాలంటే వెలుగొండ, సోమశిల జలాలతోనే సాధ్యమని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేక పాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త మేక పాటి రాజగోపాల్‌రెడ్డిలు పేర్కొ న్నారు. మంగళవారం ఉదయ గిరిలోని మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో బుధవారం జరగనున్న దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రెండో వర్ధంతి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ గౌతంరెడ్డి వర్ధంతికి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, అక్కి భాస్కర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వరికుంటపాడు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం విరువూరు, నార్త్‌కొండాయపాళెం, తూర్పుపాళెం, తొడుగుపల్లి, ధర్మవరం గ్రామాల్లో విజయ సంకల్పయాత్ర నిర్వహించారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోండి

గుడ్లూరు మండల సమావేశంలో ఎంపీపీ రమేష్


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

గుడ్లూరు, ఫిబ్రవరి 20: రానున్న వేసవి దృష్ట్యా మండలంలో నీటిఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పులి రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో జఠిలంగా మారిన పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. చేవూరు నుంచి రావూరుకి వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని చేవూరు ఎంపీటీసీ సభ్యుడు నక్కల శ్రీనివాసులు కోరారు. పాజర్లలో మంచినీటి బోర్లు బాగుచేయించాలని సర్పంచి పాటి వెంకటేశ్వర్లు కోరారు. అలాగే ఎస్టీ కాలనీలోని పాఠశాల పనులను పూర్తిగా చేయించాలన్నారు. గుడ్లూరు సర్పంచి పాలకీర్తి శంకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు సంవత్సర కాలం నుంచి జీతాలు పడడం లేదని అన్నారు. గుడ్లూరు ఎంపీటీసీ 1 సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ మాట్లాడుతూ స్థానిక పశువైద్య శాలలో మందులు అందుబాటులో లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఏవీ సుబ్బారావు, వెలుగు ఏపీఎం అశోక్, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఎంఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి గరుడ వాహనసేవ


గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

కావలిటౌన్, ఫిబ్రవరి20: ముసునూరులోని హనుమత్ క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి మంగళవారం గరుడ వాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ


గిరిజనులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందచేస్తున్న శ్రీనాథరెడ్డి

జలదంకి, ఫిబ్రవరి20: జలదంకి పంచాయతీ పరిధి నెహ్రూనగర్ కాలనీలోని 20 గిరిజన కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ స్టౌ, సిలిండర్లను బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథరెడ్డి మంగళవారం అందించారు. మండల నాయకుడు ముడి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కమతం బాలకోటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపల్లిలో 2వేల మెజార్టీ రాకుంటే రాజకీయాలొద్దు : బీఎమ్మార్

కావలిటౌన్, ఫిబ్రవరి20: తన స్వగ్రామం ఇస్కపల్లిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి 2,000 మెజార్టీ రాకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో బీఎమ్మార్ మాట్లాడారు. రాజధాని లేకపోయినా, రాష్ట్ర ఆదాయం లేకపోయినా జగనన్న ప్రజా సంక్షేమానికి లక్షల కోట్లు ఖర్చు పెట్టడం చిన్న విషయం కాదన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల అండతో ఎన్నికలకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఫిబ్రవరి 20 : మండలంలోని వీఆర్ కోట సమీపంలోని మన్నేరులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో దాడి చేసి ఇసుక నింపుకుంటున్న రెండు ట్రాక్టర్లను, డ్రైవర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అండర్‌పాస్ బ్రిడ్జి పరిశీలన



కావలిటౌన్, ఫిబ్రవరి 20: ముసునూరు రైల్వేగేట్ వద్ద నిర్మించిన అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంగళవారం అధికారులు, బీజేపీ నేతలు పరిశీలించారు. ఈనెల 26న దేశంలోని అండర్‌పాస్ బ్రిడ్జిలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కె బ్రహ్మానందం పేర్కొన్నారు. అందులో భాగంగా ముసునూరులో నిర్మించిన అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మందా కిరణ్, కామినేని ఉదయలక్ష్మి, మస్తాన్, సవీంద్ర, తిరుపతిస్వామి, మనోజ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

లింగసముద్రం : మండలంలోని ఎర్రారెడ్డిపాలెం, మాలకొండరాయునిపాలెం, వీఆర్ కోట గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లను మంగళవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఎంపీడీవో యు శేషుబాబు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు వలంటీర్లను సేవామిత్ర పురస్కారంతోపాటు ప్రశంసా పత్రాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచు డి మల్లికార్జున, వైసీపీ నాయకులు ఎం శ్రీనివాసులు, వి వెంకటేశ్వర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాజధాని ఫైల్స్ ఉచిత ప్రదర్శన

కందుకూరు : అమరావతి రైతుల కన్నీటి వ్యథను కళ్లకు కడుతూ రూపొందించిన రాజధాని ఫైల్స్ చిత్రాన్ని కందుకూరులో టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా ప్రదర్శిస్తున్నట్లు ఆపార్టీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తల కోసం ఈ ఉచిత ప్రదర్శనను యువరాజ్ థియేటర్‌లో ఏర్పాటుచేస్తున్నందున ప్రతిఒక్కరూ వీక్షించాలని కోరారు.

సూపర్‌సిక్స్ పథకాల పట్ల ఎంతో ఆదరణ : ఇంటూరి


మహిళకు కరపత్రం అందచేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 20: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల పట్ల ప్రజల్లో ఎంతో ఆదరణ ఉందని కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం పట్టణంలోని 27వ వార్డు పరిధిలోని పడమర రజకపాలెంలో నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీచేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే ఈ పథకాలన్నింటినీ అమలుచేస్తారని తెలిపారు. కందుకూరులో తనను ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పాకల మాల్యాద్రి, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కొచ్చర్ల వీరరాఘవులు, తలమంచి రాజేష్, కొత్తకోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

నివాసితుల సమస్యలు పరిష్కరించండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

కావలి, ఫిబ్రవరి 20: పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న టిడ్కో ఇళ్లలో ఉంటున్న నివాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ 200 టిడ్కో ఇళ్లలో ప్రజలు నివాసాలు ఉంటున్నారని, అక్కడ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధిలైట్లు, తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయని,అంతేకాక అపరిశుభ్రత తాండవిస్తోందన్నారు. ప్రహరీ కూడా లేదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పసుపులేటి పెంచలయ్య, వై కృష్ణమోహన్, జీ. మధుసూదనరావు, బీ. క్రిష్ణయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల శనగ 452 రకంతో అధిక దిగుబడులు



శనగపైరును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టరు ప్రసాద్‌బాబు తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 20 : నంద్యాల శనగ 452 రకంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కందుకూరు కృషి విజ్ఞానకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జీ ప్రసాద్‌బాబు తెలిపారు. బొట్లగూడూరు సమీపంలోని దూబగుంట గ్రామంలో ఎస్సీ రైతులకు ఎస్సీఎస్పీ పథకం కింద ఈరకం శనగ విత్తనాన్ని క్షేత్ర పరిశీలనకోసం అందజేసి సాగుచేయించగా, అధిక దిగుబడులు సాధించినట్లు మంగళవారం ఆయన వివరించారు. సాధారణ జెజె11 రకం సాగుచేసిన రైతులు ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే సాధించగా, నంద్యాల గ్రామ్ 452రకం సాగుచేసిన రైతులు 7.5 క్వింటాళ్ల దిగుబడి సాధించినట్లు తెలిపారు. రైతులు నంద్యాల 452ను ఎంచుకోవాలని ఆయన అన్నారు. వాతావరణం అనుకూలిస్తే 14 క్వింటాళ్లవరకు కూడా దిగుబడి సాధించే అవకాశం ఉంటుందన్నారు.

'పసుపులేటి' గెలుపునకు కృషి చేయాలి

అల్లూరు, ఫిబ్రవరి 20 : కావలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న పసుపులేటి సుధాకర్ గెలుపున కు ప్రతి కార్యకర్త కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి వెంకటేశ్వర్లు అన్నారు. అల్లూరులోని కార్యాలయంలో మంగళవారం మండలంలోని నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అల్లూరు సమన్వయకర్త ఎల్లు సాల్మన్‌రాజు, దర్గిగుంట వాసు, పసుపులేటి ప్రసాద్, కప్పల నవీన్, గుమ్మడి రాజేష్ బాబు, సత్యవోలు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడిగా ఏడుకొండలు

సీతారామపురం : ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడిగా మండలానికి చెందిన అప్పన ఏడుకొండలు ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపై వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని, చిన్న కారణాలతో నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని తెలిపారు. నెల్లూరు జిల్లాలో 163 మంది ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన నోటీసులు తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, రాష్ట్ర ఆర్థిక కమిటీలో అప్పనఏడుకొండలుకు స్థానం లభించటంతో పలువురు ఉపాధ్యాయులు, ఎస్టీయూ కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

దాడులతో భయపెట్టాలనుకోవడం తగదు : కండ్లగుంట

కావలి, ఫిబ్రవరి20: రాజకీయాల్లో దాడులు చేసి భయపెట్టాలనుకోవడం పిరికిపంద చర్య అని సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డిపై ఒంగోలు జరిగిన దాడిని ఆయన ఖండించారు. రాజకీయాలలో ఇలాంటి విషసంస్కృతి మంచిది కాదన్నారు. ఆయన రాష్ట్రనాయకుడిగా ఎదగటం చూసి ఓర్వలేకనే ఆయనపై దాడి చేశారన్నారు. ఇలాంటి దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

కందుకూరు, ఫిబ్రవరి 20: రాష్ట్ర తెలుగురైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై ఇనుపరాడ్డుతో దాడిచేసి కొట్టడమే కాక, తన అనుచరులతో కత్తులతో దాడిచేయించిన ఒంగోలు జిమ్స్ హాస్పటల్ యజమాని డాక్టరు రామచంద్రారెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీనివాసరెడ్డి త్వరగా కోలుకుని ప్రజాజీవితంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. డాక్టర్ రామచంద్రారెడ్డిని తక్షణం అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నాసిరకం నిర్మాణాలతో ప్రమాదాలు


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న యువజన సంఘం నాయకులు

బిట్రగుంట, ఫిబ్రవరి 20: బోగోలు మండలం సీఆర్ పాలెం పంచాయతీలో నిర్మిస్తున్న స్కూలు భవన నిర్మాణానికి నాసిరకం సామగ్రిని వాడుతున్నారని, తద్వారా పిల్లల ప్రాణాలకు ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున మంగళవారం ఎంపీడీవో కార్యాలయంవద్ద అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతోపాటు పనుల నాణ్యతపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్‌రాజు, అంబేడ్కర్ ఇండియన్ మిషన్ కావలి డివిజన్ అధ్యక్షుడు బత్తల రవిచంద్ర, కావూరి బంగారయ్య, వేణుగోపాల్, వాసు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ముస్లింలు బుద్ధి చెప్పాలి

ఆత్మీయ సమావేశంలో సోమిరెడ్డి


పార్టీ శ్రేణులతో కలసి ర్యాలీలో సోమిరెడ్డి

మనుబోలు, ఫిబ్రవరి 20 : మైనార్టీల సంక్షేమం విస్మరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లింలు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మనుబోలులోని సీపీఆర్ కల్యాణ మండపంలో అక్కంపేట గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ అమీర్‌బాషా ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముస్లీం మైనార్టీల ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. తొలుత జాతీయ రహదారి నుండి కల్యాణ మండపం వరకు టీడీపీ, మైనార్టీ నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. సోమిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుతోనే మైనార్టీల మనుగడ సాధ్యమన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పించి ఆర్థిక సాధికారతకు చేయూతనిచ్చారన్నారు. మైనార్టీల అభ్యున్నతిని గాలికి వదిలేసిన జగన్‌మోహన్‌రెడ్డికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాక్, మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, నాయకులు మాసం సాహెబ్, గాలి రామకృష్ణరెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, రాయపాటి కిరణ్ కుమార్, బొమ్మి సురేంద్ర, గుమ్మడి రాజాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సమావేశానికి తరలిన నేతలు

పొదలకూరు, ఫిబ్రవరి 20 : మనుబోలులోని సీపీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన ముస్లిం మైనారిటీల సమావేశానికి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ముస్లిం సోదరులు తరలివెళ్లారు. పట్టణానికి చెందిన తిరుపతి పార్లమెంటు మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ జమీర్‌బాషా, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ఈ కార్యక్రమంలో షేక్ జమీర్‌బాషా, మస్తాన్‌బాషా, ఖాదర్‌బాషా, ముక్తియర్, మంజూర్, రషీద్, యశ్విన్, దీలు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే అభివృద్ధి

సైదాపురం, ఫిబ్రవరి 20: టీడీపీ పాలనలోనే అభివృద్ధి జరిగిందని, వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి అన్నారు. సైదాపురం పంచాయతీ అరుంధతీయ వాడ లో మంగళవారం సాయంత్రం టీడీపీ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, చంద్రబాబు నాయుడు మహిళల కోసం ఏర్పాటుచేసిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు నలమారు వెంకటేశ్వర్లు రెడ్డి, సైదాపురం పట్టణ టీడీపీ గ్రామ అధ్యక్షుడు వరిగొండ సురేంద్ర, ఎస్సీ సెల్ నాయకుడు రమేష్ బాబు, కోటయ్య నాయుడు తది తరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల నాయకులు

దినేష్ గెలవాలని ప్రత్యేక పూజలు


పార్లపల్లిలో ఆళగనాథస్వామికి పూజలు చేస్తున్న సుదీప్‌రెడ్డి, మాధవ్ తదితరులు

విడవలూరు, ఫిబ్రవరి 20: రానున్న ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ పార్లపల్లి, వీరారెడ్డిపాలెం గ్రామాలను చెందిన టీడీపీ నాయకులు ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, కావ్యారెడ్డి, తుల్లూరు మాధవ్, పావని దంపతులు పార్లపల్లిలోని ఆళగనాథస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు లక్ష తులసిదళ యాగాన్ని నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు పూండ్ల ఏసోబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

వెంకటాచలం, ఫిబ్రవరి 20: మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ సమీపంలో ఉన్న స్వాతి ఫార్మసీ కళాశాలలో మంగళవారం ప్రజాసత్తా ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం సహకారంతో ఓటర్ల అవగాహన సదస్సు, ర్యాలీ, ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత వెంకటాచలం నుండి స్వాతి కళాశాల వరకు భారీ ర్యాలీ చేపట్టి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఆటల పోటీలలో విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభనబాబు, నెహ్రూయువ కేంద్రం కోఆర్డినేటర్ మహేంద్ర రెడ్డి, నాయకులు చింతల దయాకర్, టి చిరంజీవి, ఐ వెంకటరమణయ్య, స్వాతి కళాశాల ప్రిన్సిపాల్ నివేదిత, కళాశాల డైరెక్టర్ ఎం గోపినాథ్, కే సురేంద్ర, ప్రదీప్‌కుమార్, పెంచలసాయి, కార్తిక్ తదితరులున్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

వెంకటాచలం, ఫిబ్రవరి 20: మండలంలోని కంటేపల్లిలో మంగళవారం విక్రమ సింహపురి యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కే సునీత, సోషల్ వర్క్ అధ్యాపకుడు డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులున్నారు.

మైనింగ్ అక్రమాలపై ప్రజలు తిరగబడాలి

● అఖిల భారత రైతు కూలీ సంఘం

సైదాపురం, ఫిబ్రవరి 20: అక్రమ మైనింగ్‌పై ప్రజలు తిరగబడి పోరాడకుంటే ఖనిజ సంపద అంతరించిపోతుందని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కలిచేడు గ్రామంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మలతలపూరు గ్రామంలో పురాతనమైన తిప్పతోపాటు పట్టా భూముల్లో, ఓరుపల్లి గ్రామ చెరువులో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. గ్రామ సర్పంచు, ఎంపీటీసీలు పట్టించుకోకుండా మౌనంగా ఉండటం వెనుక ఉన్న కారణాలు ఏమిటని ప్రశ్నించారు. కాగా, ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీక్రిష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేయడం అమానుషమని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛతో పాటు ప్రజల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి నెల్లూరు జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు పెంచలయ్య పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణపై కళాజాత

పొదలకూరు, ఫిబ్రవరి 20 : పట్టణంలోని తొగట వీధిలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు కళాజాత బృందాలతో వీధి నాటకాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ద్వారా హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అలాగే గర్భిణులకు హెచ్ఐవీ, టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల వైస్ ఎంపీపీ సోమ అరుణ, వైసీపీ నాయకులు సోమ భాస్కర్, సోమ రామకృష్ణయ్య, లింక్ వర్కర్ స్కీం సభ్యులు గోవిందు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశావర్కర్ భారతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జగదేవిపేటలో ఆరోగ్య సురక్ష


విద్యార్థులనడిగి వైద్యసేవల వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 20 : మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలోని లేబూరు బిట్-1 లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి వరిగొండ సుమతి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య వైద్యసేవల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్ హెల్త్‌కార్డులు ప్రతి కుటుంబానికి అందచేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిషోర్ కుమార్, హెచ్ఈవో శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై పట్టు సాధించాలి



మాతృభాషా దినోత్సవంలో సంపత్‌కుమార్ తదితరులు

వెంకటాచలం, ఫిబ్రవరి 20: ప్రాథమిక దశలోనే మాతృభాషపై పట్టు సాధించాలని, ఆ దిశగా విద్యారంగం కృషి చేయాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీ రామ చంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కుట్టి లతీఫ్, టీ గౌరీ శంకర్, కార్యనిర్వాహక సిబ్బంది, భాషాభిమానులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గురివిందపూడిలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం


శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి కాకాణి తదితరులు

మనుబోలు, ఫిబ్రవరి 20 : మండలంలోని గురివిందపూడిలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో ఎల్‌వీ ప్రసాద్, సర్పంచ్ సుమత, ఎంపీపీ వజ్రమ్మ, వైసీపీ నాయకుడు మన్నెమాల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా నేదురుమల్లి జయంతి


నేదురుమల్లికి నివాళులర్పిస్తున్న నాయకులు

సైదాపురం, ఫిబ్రవరి 20: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం దివంగ నేత, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైసీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ యాదవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు గోగినేని శివకుమార్, ఎంపీటీసీ రమణ, ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కొండాపు మోహన్‌రావు, తోట శంకర్‌రెడ్డి, శేఖర్ నాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశ రుద్రాభిషేకం


విశేష అలంకరణలో శివపార్వతులు

పొదలకూరు, ఫిబ్రవరి 20: శివకేశవులకు ప్రీతికరమైన భీష్మ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని పురాతన శివాలయంలో మంగళవారం రామలింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలను వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి తదితర 11 ద్రవ్యాలతో శివాలయ ప్రధాన అర్చకులు పీబీఎస్‌వీ ప్రసాద్, వేద పండితులు శివకుమార్, రమేష్, మనోహర్, కుమార్‌స్వాములు అభిషేకించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వరప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, న్యా మంజుల జయమూర్తిరెడ్డి, హరి, సోమా భాస్కర్, కోటపాటి కృష్ణమనాయుడు, జనకల శ్రీను, గుర్రం భాస్కర్, మందా రామిరెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్ తనిఖీ


అధికారులతో సమీక్షిస్తున్న ట్రైనీ కలెక్టర్ సంజన సిన్హా

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 20 : ట్రైనీ కలెక్టర్ సంజన సిన్హా మంగళవారం నగరంలోని మెప్మా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మెప్మా ద్వారా అమలవుతున్న వివిధ పథకాలను గురించి పీడీ రవీంద్రను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఐబీ అంకయ్య, టీఈలు, ఎల్‌హెచ్ సుధాకర్, బీఎల్ సురేంద్ర, ఎస్ఎస్ కాంతయ్య, హెచ్ఎన్ హర్షిత, డీసీవో రామసుబ్బారావు, సీఎంఎం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో హడల్

● వావిలేటిపాడు సరస్వతినగర్‌లో ప్రజల బెంబేలు


వరప్రసాద్ ఇంట్లో జరిగిన చోరీ (ఫైల్)

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20 : నెల్లూరు రూరల్ పరిధిలోని 12వ డివిజన్ వావిలేటిపాడు వద్ద నున్న సరస్వతీనగర్ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఆ ప్రాంతంలో గడిచిన వారం రోజుల్లో వరుస చోరీలు వెలుగుచూడటంతో స్థానికులు హడలిపోతున్నారు. ఆర్టీసీలో పని చేసే ఓ అధికారి మూడు రోజుల క్రితం కుటుంబంతో బయటకు వెళ్లిన సమయంలో ఆయన ఇంటిని దొంగలు గల్లచేశారు. బంగారం, నగదు అపహరించుకుపోయినట్లు ఆ ప్రాంతవాసు లు చెప్తున్నారు. ఆ మరుసటిరోజు వరప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లో విలువైన వస్తువులను దోచుకెళ్లారు. మరో ఇంట్లోనూ దొంగతనం జరిగిందని... ఇలా రోజుమార్చి రోజు చోరీలు జరుగుతూనే ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. చోరీ జరిగినప్పుడు పోలీసులు వస్తున్నారే తప్ప ఆ తర్వాత మళ్లీ చోరీలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

● ఆలయాల్లో విశేష పూజలు

● తరలివచ్చిన భక్తులు


గరుడ వాహనంపై రంగనాథుడు


సత్యనారాయణగా భావనారాయణ స్వామి

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని మంగళవారం నగర వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో విశేష అభిషేకాలు, పూజలు, సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. భక్తులు విష్ణుసహస్ర నామ పారాయణం, ప్రత్యేక పూజలు జరిపారు.

● భీష్ముడి నోటి వెంట వెలువడిన విష్ణు సహస్ర నామ పారాయణం ప్రతిరోజు చేసే వారికి ఆరోగ్యం, ఐశ్వర్యంతోపాటు స్వర్గప్రాప్తి లభిస్తుందని అష్ట లక్ష్మీ పీఠం వ్యవస్థాపకుడు పీతాంబరం రఘునాథాచార్యులు తెలిపారు. మంగళవారం రాత్రి వీఆర్ హైస్కూలు ప్రాంగణంలో జరిగిన విష్ణు సహస్ర నామ పారాయణం కార్యక్రమంలో ఆయన పాల్గొని, దాని విశిష్టతను వివరించారు.

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామికి తిరుమంజనంసేవ కనుల పండువగా జరిగింది. రాత్రి గరుడ వాహనంపై పేట ఉత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

● పప్పులవీధిలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో 54 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. భక్తులకు అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయ ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నప్రసాద వితరణ చేశారు. జైశ్రీరామ్ హనుమాన్ భక్త బృందం భీష్మ ఏకాదశి వేడుకలను ఏడేళ్లుగా నిర్వహిస్తోంది.

● స్టోన్‌హౌస్‌పేట సాలెవీధిలోని భావనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం, లక్ష తులసి అర్చన జరిగాయి. విశ్వ హిందూ పరిషత్, మురళీకృష్ణ భక్త బృందం పర్యవేక్షించింది.

● అయ్యప్పగుడిలో గురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో విష్ణు సహస్ర నామ పూజలు జరిగాయి.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం జరిగింది.

దేశం గర్వించదగ్గ నేత నేదురుమల్లి

● ఘనంగా జయంతి వేడుకలు


నేదురుమల్లికి నివాళులర్పిస్తున్న నేతలు

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 20: భారతదేశం గర్వించదగ్గ నేత దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి అని పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం నేదురుమల్లి 89వ జయంతి వేడుకలు నగరంలోని ఇందిరాభవన్‌లో ఘనంగా జరిగాయి. నేదురుమల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పేదలకు దుప్పట్లు పంచిపెట్టడంతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఉడతా వెంకట్రావు, ఏటూరి శ్రీనివాసులరెడ్డి, అరవ రామమోహన్‌రావు, ఎస్‌కే ఫయాజ్, అల్లాఉద్దీన్, ముదిగొండ శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీని ఆదరించండి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న హైందవి, వైష్ణవి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 20: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించి చంద్రబాబునాయుడుకు, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరుతూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవిలు ప్రచారం నిర్వహించారు. మంగళవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 18వ డివిజన్ కాలువ కట్టలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించి ప్రజల ఆశీర్వాదాలు తీసుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● 48వ సారి రక్తదానం చేసిన రాజేంద్రప్రసాద్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 20 : రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో 48వ సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తనిధి, దివ్యాంగుల కేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.

కాలువలో ఆయిల్ బాల్స్ విడుదల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని కుక్కలగుంట, రాజేంద్రనగర్ ప్రాంతాల్లోని ఉయ్యాల కాలువలో మంగళవారం 200 ఆయిల్ బాల్స్‌ను వేశారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా లయన్స్‌క్లబ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ రెండు నెలలుగా నెల్లూరు నగరంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయన్నారు. అయినా ఎవరూ పట్టించుకోక పోవడంతో తామే ఆయిల్ బాల్స్ వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు పెంచలయ్య, రాజశేఖర్, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

జగన్ నిర్ణయాలతో 20 ఏళ్లు వెనక్కి పోయిన రాష్ట్రం

● టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 20 : పిచ్చి తుగ్లక్ జగన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో 20 ఏళ్లు వెనక్కు పోయామని, రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు యువత ఏకం కావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణను గెలిపించాలంటూ మంగళవారం 48వ డివిజన్‌లో పర్యటించి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలు రావడం లేదని, నిరుద్యోగ యువత పెరిగిపోయిందని, ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలన్నీ నీటిపాలయ్యాయని విమర్శించారు. వైసీపీ పాలనలో ఏ ఒక్కరికి రక్షణ లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. చొక్కా మడత పెట్టమన్నది జర్నలిస్టులపై దాడి చేసేందుకా అని జగన్‌ని ప్రశ్నించారు. జర్నలిస్టులంతా కన్నెర చేస్తే నీ బతుకు అడ్రస్ లేకుండా పోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై దాడి చేసిన వైసీపీ గూండాలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టి సత్య, పెంచలబాబు, సురేష్, నౌషాద్, అంబూరు పండు, సుభాష్, గోపి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

నారాయణను గెలిపించాలి : రమాదేవి


ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇస్తున్న రమాదేవి

నెల్లూరు(వైద్యం) : ఏ ఇంటికి వెళ్లినా అపూర్వ స్వాగతం లభిస్తుందని, ఆదే ఆదరణ చూపి మాజీ మంత్రి నారాయణను గెలిపించాలని ఆయన సతీమణి రమాదేవి కోరారు. మంగళవారం 40వ డివిజన్‌లో బాబూ ష్యూరిటీ... భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో నారాయణ చేసిన అభివృద్ధిని నెల్లూరు నగర ప్రజలు మరచిపోలేదన్నారు. ఈ కార్యక్రమలో టీడీపీ నేతలు గంగవరం నాని, గుమ్మడి రాజేశ్వరి, తమ్మల కృష్ణ, చలమల శీనయ్య, వెపులూరి శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న రవి, తదితరులు

బాలయ్య సైన్యం ఇంటింటి ప్రచారం : మాజీమంత్రి, టీడీపీ సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణను గెలిపించాలని కోరుతూ బాలయ్య సైన్యం అధ్యక్షుడు ఎద్దల రవి 16వ డివిజన్‌లోని రాంజీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కేసీ కృష్ణ, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సండే మార్కెట్ పునఃప్రారంభం


సండే మార్కెట్‌ను ప్రారంభిస్తున్న నేతలు

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 20 : నగరంలోని సండే మార్కెట్‌ను మార్కెట్ గౌరవాధ్యక్షుడు కిశోర్‌బాబు ఆధ్యక్షతన మంగళవారం పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమితి నేత చలంచర్ల భాస్కర్‌నాయుడు, రెడ్‌క్రాస్ సభ్యుడు నేతాజీ సుబ్బారెడ్డి లు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని సండే మార్కెట్ చరిత్రలో తన స్థానాన్ని నిలబెట్టుకుందన్నారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం కారణంగా నెలరోజులు మూతపడ్డ దుకాణాలను పూర్తిస్థాయిలో గురువారం నుంచి కొనసాగిస్తామని సండే మార్కెట్ అధ్యక్ష, కార్యదర్శులు హాఫీజ్, సెంథిల్‌లు తెలిపారు. రైతు నాయకుడు చిరసాని కోటిరెడ్డి యూనియన్ బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసైన్స్ వేదిక నేత మాల్యాద్రి, రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి సునీత, ఏఐఎఫ్‌టీయూ నేత లక్ష్మీరెడ్డి, పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, శరవణ, నాగవడివేలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత కాలువకు రైతుల విముక్తి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20 : నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం - కలివెలపాళెం రహదారి వీబీఆర్ నగర్ వద్ద పంట కాలువను ఓ రియల్ వ్యాపారి ఆక్రమించుకుని స్వాధీనం చేసుకోవడంపై కాలువ పారుదల ఆయకట్టు రైతులు ఆగ్రహించారు. కాలువను పునరుద్ధరించారు. ఏళ్ల తరబడి సాగు భూములకు నీరందించే కాలువను రియల్ వ్యాపారం కోసం కబ్జా చేసి ప్లాట్లు వేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాగా, ఈ పంట కాలువ ఆక్రమణ ఉదంతాన్ని సోమవారం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో జలవనరుల శాఖ అధికారులు కూడా రంగంలోకి దిగారు.

కొత్త వెల్లంటిలో ఉచిత కంటి వైద్య శిబిరం

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 20 : కమ్యూనిటీ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాంలో భాగంగా కొత్త వెల్లంటి హైస్కూల్లో మంగళవారం ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి 65 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 22 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. కొత్త, పాత వెల్లంటి సర్పంచులు రాధ, లక్ష్మమ్మ, నాయకులు పూడిపర్తి జనార్ధన్, పల్లవరపు చెంచయ్య, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

బుధవారం 21 ఫిబ్రవరి 2024

తాంబూలాలిచ్చేశాం తన్నుకుచావండి!

- సర్దుబాటు చేయకుండానే వైసీపీ ఇంఛార్జుల ప్రకటన
- మెజారిటీ స్థానాల్లో వర్గ విభేదాలు... అసమ్మతులు



తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని మెజారిటీ నియోజకవర్గాల్లో తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి... అన్నట్టుగా మారింది అధికార పార్టీ తీరు. ఆశావహుల మధ్య, వర్గాల నడుమ సర్దుబాటు చేయకుండానే, సయోధ్య కుదుర్చకుండానే ఇంఛార్జులను ప్రకటించేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఇంఛార్జుల ప్రకటనపై పార్టీ నేతలు, శ్రేణుల్లో అసంతృప్తి, అసమ్మతి సద్దుమణగకపోగా మరింత ఎక్కువైంది. ఇంఛార్జుల ప్రకటనతో వర్గ విభేదాలు సర్దుకుంటాయని వైసీపీ అధిష్ఠానం వేసిన అంచనాలు దీంతో తలకిందులవుతున్నాయి. కొన్ని స్థానాల్లో ఇంఛార్జుల స్వభావం సొంత పార్టీలోని వ్యతిరేక వర్గీయులతో అగాధం మరింత పెరిగిపోయేందుకు కారణమవుతోంది. వ్యతిరేకిస్తున్న వారిని కలుపుకునిపోయేందుకు ఏమాత్రం ప్రయత్నించకపోవడం లేదు. దీంతో విభేదిస్తున్న నేతల అహం దెబ్బతిని ఎన్నికల వేళ తీవ్ర పరిణామాలకు దారి తీస్తోంది.

వెంకటగిరిలో ఆలస్యంగా వ్యతిరేకుల ఇళ్లకు

వెంకటగిరిలో ఏడాది కిందటే ఇంఛార్జిగా నియమితులైనప్పటికీ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి నియోజకవవర్గంలో పార్టీపై పూర్తిగా పట్టు రావడం లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి సన్నిహితులని భావించిన నాయకులందరినీ రామ్‌కుమార్‌రెడ్డి దూరం పెట్టారనే ఆరోపణలున్నాయి. ఇపుడు ఆనం పార్టీని వీడిపోయి, రామ్‌కుమార్‌రెడ్డికి లైన్ క్లియర్ అయినా కూడా ఆనం సన్నిహితులతో ఆయన సయోధ్య కుదుర్చుకోలేదు. దూరంగా వున్న నాయకులతో ఎన్నికల్లో నష్టం కలుగుతుందని భావించిన ఆయన తల్లి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మి నేరుగా రంగంలోకి దిగి కుమారుడికి దూరంగా వున్న నాయకులను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. పలువురు నాయకుల ఇళ్లకు వెళ్లడంతో పాటు మరికొందరిని తన ఇంటికి ఆహ్వానించి కుమారుడికి ఎన్నికల్లో సాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. ఆమె పట్ల వారికి గౌరవం వున్నప్పటికీ వారు సర్దుకోలేకపోతున్నారు. రామ్‌కుమార్‌రెడ్డి వెళ్లకుండా ఇంట్లో కూర్చుని వుంటే తామెందుకు మద్దతివ్వాలన్న ప్రశ్న వారి నుంచీ ఎదురవుతోంది. మొదటగా పోటీ చేయనున్న అభ్యర్థి వెళ్లి సహకారం కోరితే తర్వాత ఆయన తరపు ఎవరు వెళ్లినా ఇబ్బంది వుండేది కాదు.అలా కాకుండా రామ్‌కుమార్‌రెడ్డి బాగా ఆలస్యంగా మేల్కొని ఇపుడు ఎన్నికలు ముంచుకొచ్చాక వ్యతిరేకుల ఇళ్లకు వెళుతున్నారు. దీంతో పార్టీలోని ఆయన వ్యతిరేకవర్గం సర్దుకునేందుకు సుముఖంగా లేరని సమాచారం.

గూడూరు ఎమ్మెల్యేతో పార్లమెంటు పరిధిలో నష్టం

గూడూరులో సిట్టింగ్ ఎమ్మెల్యేని పక్కన పెట్టి కొత్త ఇంఛార్జిగా ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్‌ను వైసీపీ అధిష్ఠానం ప్రకటించేసింది. ఈ సందర్భంగా సిట్టింగ్ ఎమ్మెల్యే అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు.కనీసం ప్రత్యామ్నాయం కూడా సూచించలేదు. ఐదేళ్ళు ఎంపీగా, ఐదేళ్ళు ఎమ్మెల్యేగా తాను సేవలందించిన పార్టీ నుంచీ ఈ రకమైన ధోరణి ఎదురుకావడం వరప్రసాదరావు మనసును కలచివేసినట్టు సమాచారం. దీంతో ఆయన తన పదేళ్ళ రాజకీయ నేపథ్యాన్నే అర్హతగా, ప్రామాణికతగా తీసుకుని జనసేన పార్టీ నుంచీ తిరుపతి ఎంపీగా పోటీ చేసేందుకు యత్నిస్తున్నారు.ఆయన తిరుపతి పార్లమెంటు పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ సన్నిహితులతో, పరిచయస్తులతో కలుస్తున్నారు. వారి మద్దతు కోరుతున్నారు. ఆయన కార్యకలాపాలు తెలుస్తున్నా వైసీపీ అధిష్ఠానం ఆయనతో సర్దుబాటుకు యత్నించడం లేదు. ఇది వరప్రసాదరావును, ఆయన సన్నిహితులను మరింత రెచ్చగొడుతోంది. దీంతో ఆయన రెట్టించిన పట్టుదలతో చాపకింద నీరులా జనసేనలో తన అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు యత్నిస్తున్నారు. నిస్సందేహంగా ఇవి వైసీపీకి తిరుపతి పార్లమెంటులో, ప్రత్యేకించి గూడూరు సెగ్మెంట్‌లో నష్టం చేకూర్చే పరిణామాలే.

జీడీనెల్లూరులో సయోధ్యకు ఫలించని యత్నాలు

డిప్యూటీ సీఎంగా, సీఎం జగన్‌కు సన్నిహితుడిగా పేరున్నప్పటికీ నారాయణస్వామి టికెట్ విషయంలో అధిష్ఠానం నుంచీ అమర్యాదకర అనుభవాన్ని ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలో పలువురు సొంత పార్టీ నాయకులు, పీఏలుగా వ్యవహరించిన రక్త సంబంధీకులు కూడా ఎదురు తిరిగారు. దీంతో అధిష్ఠానం ఆయన్ను చిత్తూరు ఎంపీ స్థానానికి ఇంఛార్జిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో చిత్తూరు ఎంపీని ఇంఛార్జిగా నియమించింది. వారం పదిరోజులకే మళ్ళీ నిర్ణయం మార్చుకుని వారిని వారివారి యధా స్థానాలకు తిరిగి ఇంచార్జులుగా నియమించింది. తొలి ప్రకటనప్పుడు గానీ మలి ప్రకటనప్పుడు గానీ వర్గ విభేదాలు సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం యత్నించలేదు. నారాయణస్వామిని వ్యతిరేకిస్తున్నది ప్రధానంగా మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి. ఆయన కనుసన్నల్లోనే స్వామి వ్యతిరేకవర్గం కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. దీంతో జ్ఞానేంద్రరెడ్డితో సర్దుబాటు చేసుకునేందుకు స్వామి యత్నిస్తున్నారు. ఇటీవల సీఎం రాక సందర్భంగా రేణిగుంటలోని విమానాశ్రయంలో ఒకసారి, తర్వాత పెనుమూరులో వ్యవసాయ క్షేత్రంలో ఆయనతో మాట్లాడి సాయం చేయాలని అభ్యర్థించారు. అయితే క్షేత్ర స్థాయిలో చేతులు కలిపేందుకు వ్యతిరేకవర్గం అంగీకరించడం లేదు. దీంతో నాయకుల చుట్టూ తిరగడం కంటే టికెట్ ప్రకటించాక నేరుగా జనం వద్దకే వెళ్ళి బతిమాలుకుంటానని నారాయణస్వామి సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్టు సమాచారం. ఈ పరిణామంతో ఇరువర్గాల మధ్య విభేదాలు మరింత ముదురుతున్నాయి.

సైలెంటైన ముగ్గురు ఎమ్మెల్యేలు

చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులును పక్కకు తప్పించి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డిని ఇంఛార్జిగా ప్రకటించిన ప్రారంభంలో అంతా బాగున్నట్టే అనిపించింది. గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో ఎంచక్కా ఎమ్మెల్యేయే స్వయంగా అనుచరవర్గాలతో ఆత్మీయ సమావేశాలు పెట్టి విజయానందరెడ్డి గెలుపుకోసం సహకరించాలని కోరారు. అయితే రాజ్యసభ అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం నిర్ణయం మారిపోవడంతో ఒక్కసారిగా ఎమ్మెల్యే సైలెంట్ అయ్యారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు రెండింటికీ దూరమయ్యారు. రాజకీయంగా వేగంగా నిర్ణయాలు తీసుకుని విజయవంతంగా అమలు చేయడంలో సిద్ధహస్తుడైన ఎమ్మెల్యే శ్రీనివాసులు పైకి మౌనంగా వున్నట్టు కనిపించినా అంతర్గతంగా ప్రత్యామ్నాయం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తుంటారన్న అనుమానాలు వైసీపీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. పూతలపట్టులో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబును పక్కన పెట్టి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఇంఛార్జిగా నియమించారు. బహిరంగంగానే మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేసిన ఎంఎస్ బాబు తర్వాత పోరపాటైందని ప్రకటించి మౌనవ్రతం పాటిస్తున్నారు. మకాం బెంగుళూరుకు మార్చారు. వైసీపీ, ప్రభుత్వ కార్యక్రమాలు రెండింటికీ హాజరు కావడం లేదు. ఆయనకు మద్దతు పలికిన నాయకులు, అనుచరులు కూడా ఇంఛార్జితో కలవడం లేదు. ఎమ్మెల్యే తరహాలో పార్టీ కార్యకలాపాలకు దూరంగా వుంటున్నారు. వీరిని కలుపుకునిపోయేందుకు పార్టీ పరంగా కూడా ప్రయత్నాలు జరగడం లేదు. దీంతో రెండు వర్గాల నడుమ అంతరం అలానే వుండిపోయి రోజులు గడిచే కొద్దీ పెరుగుతోంది. మదనపల్లెలో సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాను విస్మరించి నిషార్ అహ్మద్‌ను ఇంఛార్జిగా నియమించిన సంగతి తెలిసిందే. దీనిపై బహిరంగంగా ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెరమరుగయ్యారు. పార్టీ కార్యక్రమాలతో పాటు చివరికి అధికారిక కార్యక్రమాలకు కూడా దూరమయ్యారు. మకాం బెంగళూరుకు మార్చారు. ఎన్నికల్లో ఆయన చురుగ్గా పనిచేసేలా అధిష్ఠానం యత్నించడం లేదు. జిల్లా నేతలు సైతం ఆయన్ను పట్టించుకోవడం లేదు.

సత్యవేడు వైసీపీలో మరింత గందరగోళం

సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలాన్ని తిరుపతి లోక్‌సభకు ఇంఛార్జిగా బదిలీ చేసి ఆయన స్థానంలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు ఇంఛార్జిగా నియమించడంతో అంతర్గత పోరు రగులుకుని తారస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. ఇపుడు ఆ నియోజకవర్గంలో అధికార పార్టీ మరింత గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఆదిమూలం తాను ఎంపీగా పోటీ చేయనని ప్రకటించడంతో పాటు టీడీపీలో చేరే క్రమంలో యువనేత నారా లోకేశ్‌ను కూడా కలిశారు. ఆదిమూలం తిరుగుబాటుతో తిరుపతి ఎంపీ గురుమూర్తిని తిరిగి తిరుపతి లోక్‌సభ ఇంఛార్జిగా నియమించిన అధిష్ఠానం సత్యవేడుకు మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడైన నూకతోటి రాజేష్‌కుమార్‌ను ఇంఛార్జిగా ప్రకటించింది. మంత్రి పెద్దిరెడ్డి సత్యవేడు నియోజకవర్గ ముఖ్యులను తిరుపతిలో తన ఇంటికి పిలిపించుకుని రాజేష్‌ను పరిచయం చేశారు. ఆయన గెలుపుకోసం కృషి చేయాలని నిర్దేశించారు. మంత్రి ఎదురుగా వినయంగా చేతులు కట్టుకుని మరీ తలలూపి బయటకు వచ్చిన నాయకులు నియోజకవర్గం చేరగానే స్థానికులకే టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నారు. కేవీబీపురం మండల నేత డేవిడ్ తన మద్దతుదారులను వెంటబెట్టుకుని రాజేష్ సమక్షంలోనే ఎంపీ మిధున్‌రెడ్డిని కలసి టికెట్ కోరడం కలకలం రేపింది. బయటి వారిని తమపై రుద్దకుండా స్థానికులకే టికెట్ కేటాయించాలన్న డిమాండ్ ఊపందుకుంటున్నందున నియోజకవర్గంలో గందరగోళం నెలకొంటోంది. దీనివల్ల అభ్యర్థి విషయంలో మార్పులుంటాయన్న అంచనాలు కూడా మొదలవుతున్నాయి.

నగరి, సూళ్ళూరుపేటల్లో కుదరని సయోధ్య

నగరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో వైసీపీ అధిష్ఠానం ఇంచార్జులను మార్చకపోయినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యేల వర్గాలకు, వ్యతిరేక వర్గాలకు నడుమ సయోధ్య కుదరడం లేదు. నగరిలో మంత్రి రోజాయే తిరిగి పోటీ చేస్తారా లేక కొత్త అభ్యర్థి వస్తారా అన్నది తేలడం లేదు. రోజా సైతం బింకంగానే తప్ప ధీమాగా తానే పోటీ చేస్తానని చెప్పలేకపోతున్నారు. అదే సమయంలో ఆమెను వ్యతిరేకిస్తున్న పార్టీ నేతలతో మాట్లాడి రాజీ కుదిర్చే ప్రయత్నం ఏ స్థాయిలోనూ జరగడం లేదు. జిల్లాపై పట్టున్న ఓ మంత్రి నగరిలో జోక్యం చేసుకుంటున్నారని గతంలో అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఇపుడా మంత్రి తానెందుకు పట్టించుకోవాలని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. దీంతో వ్యతిరేకవర్గాన్ని కలుపుకుని పోయే ప్రయత్నాలకు స్వస్తి పలికిన రోజా వారు కలిగించే నష్టాన్ని పూడ్చుకునేందుకు ప్రత్యామ్నాయం అన్వేషిస్తున్నారు. ఆ క్రమంలో రాజకీయాలకు దూరంగా వున్న వర్గాలను, ముఖ్యులను కూడా కలసి మద్దతు కోరుతున్నారు. ఆమె తీరు సొంత పార్టీలో వ్యతిరేక వర్గాన్ని మరింతగా రెచ్చగొడుతోంది. వారి మధ్య అగాధం మరింత పెరుగుతోంది. సూళ్ళూరుపేటలో సైతం టికెట్ విషయంలో సంజీవయ్యకు అధిష్ఠానం హామీ ఇచ్చినట్టు ప్రచారమవుతోంది. అయినా పార్టీలో వ్యతిరేకవర్గం రాజీ పడడంలేదు. సంజీవయ్యకు టికెట్ ఇస్తే ఓడిస్తామన్న శపథానికి కట్టుబడి అధిష్ఠానం ప్రకటన కోసం వేచి చూస్తున్నట్టు సమాచారం. అవసరమైతే టీడీపీ అభ్యర్థికి బహిరంగంగా కొందరు, లోపాయికారీగా కొందరు సహకరించే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ కూడా ఎమ్మెల్యేకి, వ్యతిరేక వర్గానికి నడుమ విభేధాలు తొలగించి దగ్గర చేసే ప్రయత్నం ఎవరూ చేయడం లేదు. మొత్తానికి కీలకమైన ఎన్నికల వేళ ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 17 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ తొమ్మిది నియోజకవర్గాల్లో అధికార పార్టీ పరిస్థితి అంతర్గత కలహాలతో దారుణంగా వుంది.

ఐఐటీ, ఐసర్, ట్రిపుల్ ఐటీ

జాతికి అంకితం

ఏర్పేడు, ఫిబ్రవరి 20 : తిరుపతి ఐఐటీ, ఐసర్, శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు జాతికి అంకితమయ్యాయి.మంగళవారం మధ్యాహ్నం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్మూ రాష్ట్రం నుంచీ ఈ ఉన్నత విద్యాసంస్థలను వర్చువల్‌గా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఐఐటీ, ఐసర్, ఐఐఎం తదితర 36 జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థలను ప్రధాని ప్రారంభించగా అందులో జిల్లాకు చెందిన మూడు సంస్థలు వున్నాయి. ఏర్పేడు మండలంలోని ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రధాని మోదీ ప్రసంగాన్ని భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ఆహూతులకు ప్రదర్శించారు.గవర్నర్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి జగన్ విజయవాడ నుంచీ వర్చువల్‌గా పాల్గొనగా ఐఐటీ క్యాంపస్‌లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఐఐటీ డైరెక్టర్ కె.ఎస్.సత్యనారాయణ,పీఆర్వో చమన్ మెహతా, ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్‌కుమార్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఐసర్‌లో కార్యక్రమానికి ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ లక్ష్మీశా,ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య హాజరయ్యారు. రాష్ట్ర విభజన చట్టం కింద కేంద్రం ఏపీకి మంజూరు చేసిన ఐఐటీ, ఐసర్‌లను అప్పటి సీఎం చంద్రబాబు తిరుపతి జిల్లాలో ఏర్పాటు చేయించిన సంగతి తెలిసిందే. వీటిలో ఐఐటీ 2014లో తిరుపతిలోని చదలవాడ కళాశాలల ప్రాంగణంలోని అద్దె భవనాల్లో ప్రారంభం కాగా 2015 మార్చిలో రాష్ట్రప్రభుత్వం ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీలో 548 ఎకరాలు కేటాయించింది. భవనాల నిర్మాణానికి రూ. 863 కోట్లు, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి కోసం రూ. 230 కోట్లు చొప్పున కేంద్రం సుమారు రూ. 1093 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికి తొలిదశ నిర్మాణాలు పూర్తి చేసుకోవడంతో ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రస్తుతం ఐఐటీలో 1550 మంది విద్యార్థులుండగా అందులో 900 మంది బీటెక్ విద్యార్థులు, మిగిలిన వారు పీజీ కోర్సులు చేస్తున్నారు. ఇక ఐసర్ (ఇండిన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి) విషయానికొస్తే 2015లో తిరుపతి నగరం కరకంబాడి రోడ్డులోని మంగళం వద్ద తాత్కాలిక భవనాల్లో ఏర్పాటైంది. 2016లో ఏర్పేడు మండలంలో రాష్ట్ర ప్రభుత్వం 255 ఎకరాల భూమి కేటాయించింది. కేంద్రం విడుదల చేసిన రూ. 1437.91 కోట్లతో ఐసర్ తొలి దశ నిర్మాణాలు పూర్తి చేసుకుంది. 35 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ సంస్థలో ఇపుడు 1100 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక ట్రిపుల్ ఐటీ సత్యవేడులో శ్రీసిటీ సెజ్ ఆధ్వర్యంలో నడుస్తోంది.



అక్రమ గ్రావెల్ తవ్వకాలపై సర్వే

- అటవీ, రెవిన్యూ భూములకు హద్దుల గుర్తింపు



శిరసనంబేడులో సర్వే చేపడుతున్న అధికారులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 20:పెళ్లకూరు మండలంలోని రోసనూరు, శిరసనంబేడుల్లో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మంగళవారం రెవిన్యూ, అటవీ శాఖల ఉమ్మడి సర్వే జరిగింది.గ్రావెల్ తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని ఇటీవల హైకోర్టు స్టే ఇచ్చింది. గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న భూములను ఏ శాఖకు చెందినవో గుర్తించడంతో పాటు నిబంధనలు పాటించారా లేదా అన్న దానిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆయా శాఖలను హైకోర్టు ఆదేశించింది. దీంతో ఈ రెండు గ్రామాలలోని కొండ ప్రాంతాల్లో మంగళవారం మైనింగ్ ఏడీ డీవీ రంగారావు, విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్, అటవీశాఖ అధికారులతో పాటు తహసీల్దార్ కేవీ ఆర్వీ ప్రసాదరావు, ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వో రవిచంద్ర సర్వే నిర్వహించారు. ముందుగా అటవీ, రెవిన్యూ శాఖ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. బుధవారం ఏ శాఖకు సంబంధించి ఎన్ని ఎకరాల భూముల్లో గ్రావెల్ తవ్వకాలు జరిగాయి,ఎంత మేరకు తవ్వకాలు చేపట్టారో అనే దానిపై సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు.

మీ ఆశలు వమ్ము కానివ్వం

త్వరలోనే చంద్రన్న రాజ్యం వస్తుంది

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్లు

కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి



కుప్పం/గుడుపల్లె, ఫిబ్రవరి 20: 'మీ నాయకుడిపై చాలా నమ్మకం పెట్టుకున్నారు మీరంతా. ఆ నమ్మకం ఎప్పటికీ వమ్ము కానివ్వం. మీ కష్టాలు తీరే రోజు ఇంకా ఎంతో దూరంలో లేదు. త్వరలోనే మీరు కోరుకున్న చంద్రన్న రాజ్యం వస్తుంది' అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ఎండీ నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం, కుప్పంలో పర్యటించారు. చంద్రబాబు జైలుకెళ్లిన సమయంలో మనోవేదనతో మృతి చెందిన గుడుపల్లె మండలం కొడతనపల్లెకు చెందిన వి.వెంకటేశ్, , యామగానిపల్లెలో జి.శ్రీనివాసులు కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు అందించారు. అనంతరం రైల్వే స్టేషన్ సర్కిల్ సమీపంలో అన్న క్యాంటీన్ ప్రారంభించి మాట్లాడారు. 'చంద్రబాబు జైల్లో ఉన్న 53 రోజులూ మీరు నిద్రాహారాలు మాని ఆయనకోసం తపించారు. ఆయన జైలు నుంచి వెలుపలకు రావాలని, ఆయనమీద పెట్టిన తప్పుడు కేసులు మాఫీ కావాలని ఎన్నో దేవుళ్లకు మొక్కుకున్నారు. ప్రభుత్వం ఎన్ని అరాచకాలకు పాల్పడినా నిరసనలు చేసి, మీ నాయకుడికోసం నిలబడ్డారు. నాయకుడిపై నమ్మకంతో ధైర్యంగా ఉన్నారు. పార్టీ శ్రేణులన్నీ మా కుటుంబంపై చాలా నమ్మకం పెట్టుకున్నారు. మీ భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటాం' అంటూ భువనేశ్వరి హామీ ఇచ్చారు.


పేదల ఆకలి తీర్చడం ఓర్వలేక..

'పేదల కోసం అన్నగారు కిలో రెండు రూపాయల బియ్యం తీసుకొచ్చారు. పేదల ఆకలి తీర్చాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో 364 అన్న క్యాంటీన్లు ప్రారంభిచారు. ఏటా 7.50 కోట్ల మంది భోజనం చేస్తూ వచ్చారు. ఇలా పేదల ఆకలి తీర్చుతుండడం ఓర్వలేకే ప్రభుత్వం అన్న క్యాంటీన్లను నిలిపేసింది. పేదల కడుపు కొట్టింది. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలే అక్కడక్కడా సొంతంగా అన్న క్యాంటీన్లు తెరిచి పేదలకు అన్నదానం మొదలు పెట్టారు. ఇలా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 150 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి. మంగళగిరిలో నారా లోకేశ్ నాలుగు క్యాంటీన్లు నడుపుతున్నారు. కుప్పంలో ఒక్కటే ఉంది. ఇప్పుడు కుప్పంతో పాటు గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పంలో ఒక్కోటి చొప్పున మొత్తం మూడు క్యాంటీన్లు ప్రారంభిస్తున్నాం. ఇవి పూర్తిగా మా కుటుంబ ఆధ్వర్యంలో నడుస్తాయి' అని భువనేశ్వరి చెప్పారు. అనంతరం ఆమె మల్లప్పకొండమీదకు వెళ్లి మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆపైన కుప్పం పట్టణ పరిధిలోని చర్చిలో ప్రార్థనలు జరిపారు. అనంతరం కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేటి పర్యటన ఇలా..

శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న సొంతింటిని ఉదయం 10గంటలకు పరిశీలిస్తారు. 10.10 గంటలకు శాంతిపురం పాత గ్రామీణ బ్యాంకు క్రాస్‌లో మహిళలతో 'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' అంశంపై ముఖాముఖి నిర్వహిస్తారు. 11.20 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో12.20 గంటలకు రామకుప్పం పోలీసు స్టేషన్ సర్కిల్ వద్ద అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు.వి.కోట మండలం విబూదిఎల్లాగరం గ్రామం వద్ద మధ్యాహ్నం 1.10 గంటలకు భోంచేస్తారు. తర్వాత నారా భువనేశ్వరి పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చేరుకుని కనకరాజు, కత్తార్లపల్లెలో శంకరప్ప కుటుంబాలను పరామర్శిస్తారు.తరువాత పుంగనూరు మండలం ఎన్‌ఎస్‌పేటకు చెందిన పద్మావతమ్మ, చెలిమిగడ్డకు చెందిన జయమ్మ, ఒంటిమిట్టకు చెందిన శ్రీనివాసులు నాయుడు కుటుంబీకులను బుధవారం సాయంత్రం భువనేశ్వరి పరామర్శిస్తారు. అనంతరం మదనపల్లె చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు.

ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా హరి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మిద్దెల హరి నియమితులయ్యారు.గతంలో ఆప్కో డైరెక్టర్‌గా, శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్‌గా హరి పనిచేశారు. ఈ సందర్భంగా హరికి పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

చీటీల పేరుతో రూ.కోటిన్నర టోకరా



పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20: చీటీలో పేరుతో రూ.కోటిన్నర టోకరా వేసిన ఘటన సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.... సూళ్లూరుపేటకు చెందిన మొఘల్ చాంద్‌బాషా పట్టణంతో పాటు కోటపోలూరు, మన్నారుపోలూరు, లింగంపాడు, ఎన్‌వీకండ్రిగ గ్రామాల్లో పలువురి చేత దీపావళి చిట్‌ఫండ్‌తో పాటు నెలవారీ చీటీలు నిర్వహించేవాడు. చీటీ పాడుకొన్న వారికి నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. దాదాపు రూ.కోటి 50 లక్షల వరకు వసూలు చేసిన చాంద్‌బాషా కొంతకాలంగా కనిపించకుండా తిరుగుతున్నాడు. బాధితులు కొందరు సోమవారం రాత్రి చాంద్‌బాషాను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. చీటీల పేరుతో డబ్బులు కట్టించుకొని మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకొన్న మిగిలిన బాధితులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని చాంద్‌బాషా తమను కూడా మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చాంద్‌బాషాపై చీటింగ్ కేసు నమోదు చేశారు. కాగా, అపాచీ కర్మాగారంలో పనిచేసే కార్మికులే ఎక్కువ మంది చాంద్‌బాషా వద్ద చీటీలు వేసినట్లు తెలిసింది.

క్యాన్సర్‌పై అవగాహన కలిగివుండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

గూడూరు, ఫిబ్రవరి 20: క్యాన్సర్‌పై సరైన అవగాహన కలిగివుంటే వ్యాధి నుంచి విముక్తిని పొందవచ్చునని క్యాన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక సునీత సేవా సంస్థ కార్యాలయంలో సేవాసంస్థ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్, ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వాడడం, మద్యం సేవించడం, రసాయనాలతో కూడి ఆహారాన్ని భుజించడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి వాటి వల్ల క్యాన్సర్ సోకే అవకాశం ఉందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య సంరక్షణకు తగు జాగ్రత్తలు పాటించడం, మంచి ఆహారపు అలవాట్లను పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. క్యాన్సర్ వ్యాధిని తొలిదశలో గుర్తించడం ద్వారా త్వరితగతిన నయం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది పద్మజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

బాలాయపల్లి, ఫిబ్రవరి 20: బాలాయపల్లిలో వరసిద్ధి వినాయక పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ శంకరమ్మ తెలిపారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో రుద్రమదేవి మెగా కప్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కరాటే, కుంగ్ ఫూ, తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఇందులో ఎన్.బిందుజా, ఎన్.గేయవర్థిని బంగారు పతకాలు, ఎం.వర్షిణి సిల్వర్, వై.లాక్షిత, కే.నందిని ప్రియ, జే.కమలేష్, పీ.కార్తికేయ, ఎం.శ్రీహర్ష, టీ.జశ్వంత్ బ్రాంజ్ పతకాలు సాధించారు. పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు. కోచ్ శివశంకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

గూడూరు, ఫిబ్రవరి 20: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం వైఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గురవయ్య మాట్లాడుతూ యువతను క్రీడల పట్ల ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. కార్యక్రమంలో సునీల్‌రెడ్డి, విద్యాసాగర్, ఆర్ముగం, మురళి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడి అమానుషం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20: ప్రజాస్వామ్యం ప్రభుత్వానికి, ప్రజలకు నడుమ వారధిగా పనిచేస్తున్న మీడియా దాడి చేయడం అమానుషమని సీపీఎం నాయకులు సాంబశివయ్య, ఎస్కే రియాజ్ నాయకులు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై విక్షణారహింగా వైసీపీ మూకలు దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. నిందితులపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నేదురుమల్లి జనార్దనరెడ్డికి నివాళి



జనార్దనరెడ్డి విగ్రహం వద్ద రాంకుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 20: మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి జయంతి మంగళవారం నిర్వహించారు. వెంకటగిరి పట్టణంలోని ఎన్‌జేఆర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు అందజేశారు. సాయంత్రం బాలసదన్‌లో చిన్నారులకు అల్పాహారం, స్వీట్స్ పంపిణీ చేశారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళామందిర్‌లో నేదురుమల్లి జనార్ధన రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ మేరిగ మురళి నివాళులర్పించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. వైసీపీ నాయకులు భక్తవత్సలరెడ్డి, షనిల్‌రెడ్డి, విజయసారధిరెడ్డి, విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వాకాడు: నేదురుమల్లి జనార్ధనరెడ్డి జయంతిని వాకాడులోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేదురుమల్లి రాజ్యలక్ష్మి నివాళులర్పించారు. సింగిల్ విండో ఛైర్మన్ కొడవలూరు భక్తవత్సలరెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణయ్య, ఏనుగు సుధాకర్‌నాయుడు, వాకాటి జనార్ధనరెడ్డి, కారికేటి నిర్మల, మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ ప్రారంభం

కోట, ఫిబ్రవరి 20: కోటలోని కోటమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న వెంకన్నపాళెం గ్రామదేవత గంగమ్మగుడి వద్ద మంగళవారం దాతల సహకారంతో ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించారు. మాజీ ఎంపీపీ గుర్రం అశోక్‌కుమార్, గుర్రం శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, చంద్రయ్య, కృష్ణయ్య, రమణయ్య పాల్గొన్నారు.

ఆర్ఎస్ఐ ఇంట్లో చోరీ

6.4 సవర్ల బంగారం అపహరణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20: రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్(ఆర్ఎస్ఐ) ఇంట్లోనే దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన నాయుడుపేట పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... వెంకటగిరి బెటాలియన్‌లో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న కోటేశ్వరరావు నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మూరులో నివాసం ఉంటున్నారు. ఈ నెల 17వ తేదీన కోటేశ్వరరావు విధులకు వెళ్లగా, ఆయన సతీమణి దేవసేనమ్మ ఇంటికి తాళాలు వేసుకొని నెల్లూరుకు వెళ్లింది. 19వ తేదీ సోమవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న 6.4 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

రెండు మోటారు సైకిళ్ల చోరీ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20: నాయుడుపేట పట్టణంలో సోమవారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు చోరీ అయ్యాయి. బ్రాహ్మణవీధిలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్, సీఎస్‌తేజ సెంటర్‌లో నివాసం ఉంటున్న మహేష్ సోమవారం రాత్రి తమ ఇళ్ల ముందు మోటారు సైకిళ్లను పార్క్ చేశారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బ్యాంక్ మేనేజర్‌పై దాడి: కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20: పట్టణంలోని ఓ బ్యాంక్ మేనేజర్‌పై ఇద్దరు యువకులు దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. చిన్నదర్గావీధిలో ఓ బ్యాంకు మేనేజర్ మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఓ కారు రాసుకుంటూ వెళ్లింది. ఈ విషయమై మేనేజర్‌కు, కారులో ఉన్న వ్యక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కారులో ఉన్న ఇద్దరి యువకులు దుర్భాషలాడుతూ తనపై దాడిచేసినట్లు మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్ల అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

రైతుల జోలికొస్తే ఉద్యమిస్తాం: కురుగొండ్ల



రైతులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 20: రైతులకు చాలీ చాలకుండా నీటిని విడుదల చేసి, ఆపై ఆక్షలు విధించడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలుగు గంగ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగ కాలువకు వేసుకొన్న పైపులను అధికారులు పగల గొడుతున్నారంటూ బాలాయపల్లి, వెంకటగిరి మండలాలకు చెందిన రైతులు మంగళవారం కురుగొండ్ల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన రైతులను వెంటబెట్టుకొని బంగారుపేట వద్ద వున్న తెలుగు గంగ అక్విడెట్ వద్దకు చేరుకొన్నారు. కాలువలో పైపులైను ఏర్పాటు చేసి సైఫన్ పద్ధతిలో సాగునీటిని చెరువులకు మళ్లించడాన్ని తెలుగుగంగ అధికారులు అడ్డుకొన్నట్లు రైతులు వివరించారు. ఇది గమనించి కురుగొండ్ల తెలుగు గంగ అధికారుల చర్యలను తప్పుబట్టారు. పైఅధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారమే తాము నడుచుకున్నామని అధికారులు చెప్పడంతో రామకృష్ణ ఫోన్‌లో తెలుగుగంగ ఉన్నతాధికారులతో మాట్లాడారు. రైతుల సాగునీటి ఇబ్బందులను తీర్చాల్సిన అడ్డుకొంటే ఎలా అని అధికారులను ప్రశించారు. ప్రస్తుతం విడుదల చేసిన 250 క్యూసెక్కుల నీరు చివరి వరకు రావడం లేదని, 500 క్యూసెక్కులకు పెంచాలని సూచించారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని తెలుగుగంగ ఉన్నతాధికారులు సమాధానమిచ్చారు. అనంతరం కురుగొండ్ల మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ఇన్‌చార్జికి నీటి విడుదలపై సరైన అవగాహన లేదన్నారు. ఎంత మేర నీటిని విడుదల చేస్తే రైతులకు ఉపయోగం ఉంటుందో తెలుసుకొని వుంటే బాగుండేదన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రసాద్ నాయుడు, సీసీ నాయుడు, కొర్రపాటి రామచంద్రయ్య, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, సుధ, మురళి, మచ్చల వేణు పాల్గొన్నారు.

జటిలంగా ట్రాఫిక్ సమస్య



సంఘం థియేటర్ సెంటర్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

గూడూరు, ఫిబ్రవరి 20: పట్టణంలో రోజుకురోజుకు ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో స్థానిక సంఘం థియేటర్ సెంటర్ నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి, సంఘ థియేటర్, కుమ్మరవీధి సెంటర్ మీదుగా ఆస్పత్రి రోడ్డు గుండా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ మార్గం ద్వారానే చిల్లకూరు, జాతీయ రహదారి వైపునకు వెళ్లాల్సి ఉండడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. అంతేకాకుండా పలు ప్రభుత్వ కార్యాలయాలకు, ఏరియా ఆస్పత్రికి, సమీప గ్రామాల నుంచి పట్టణంలోకి వచ్చేవారు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఉదయం 10నుంచి, సాయంత్రం 6 గంటల నుంచి ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో మేతకు వెళ్లే పశువులు కూడా దారి నుంచే వెళుతుండంతో ఉదయం, సాయంత్రం సమయాల్లోనే వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవాల్సి వస్తోంది. అంతేకాకుండా రహదారి వెంబడి దుకాణాలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు పార్కింగ్ చేస్తుండడంతో వాహనాల రాకపోకలకు అడ్డంకి మారుతోంది. ఒక్కసారి ట్రాఫిక్ నిలిచిపోతే సుమారు అర్ధ కిలోమీటరు వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. ట్రాఫిక్ సమస్య కారణంగా వాహనదారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాక్షసపాలనకు చరమగీతం పాడదాం: కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో జరుగుతున్న రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధం కావాని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ పరిధిలోని 19వ వార్డు జట్టిపాళెం, బలిజపాళెం, బొమ్మిడీ కాలువ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ - భవిషత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మినీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, రమణయ్య, కాపా శ్రీనివాసులు నాయుడు, గంగరాజు, రవి, సుధ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

గూడూరు, ఫిబ్రవరి 20: స్థానిక గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వాసు, రాఘవయ్య, మస్తాన్‌బీ, మంజుల, హరిత, గౌరీ పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న సర్పంచుల సంఘం నేతలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 20: పంచాయతీల నిధులను దారి మళ్లించి సర్పంచులకు విధులు, నిధులు లేకుండా చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా రానున్న ఎన్నికల్లో సర్పంచులందురూ పనిచేయనున్నట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం కందమూడి శివకుమార్, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో రాష్ట్ర సర్పంచుల సంఘం, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు.

కోళ్ల నుంచి రక్త నమూనాల సేకరణ

గూడూరు, ఫిబ్రవరి 20: బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి వార్తల నేపథ్యంలో నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో మంగళవారం చిత్తూరుకు చెందిన ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఉపసంచాలకురాలు డాక్టర్ మృణాలిని పలు కోళ్ల దుకాణాలు, గూడూరు మండలంలోని మిటాత్మకూరు గ్రామంలో గల కోళ్లఫారాలలో కోళ్లకు, కముజు పిట్టల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గూడూరు మండలంలో మూడు, బాలాయపల్లి మండలంలో రెండు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇక్కడ పశువైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. బర్డ్‌ఫ్లూ గురించి ఏ విధమైన భయాందోళనలకు లోనుకావాల్సి అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్‌ఫ్లూపై పుకార్లు పట్టించుకోవద్దు

వాకాడు, ఫిబ్రవరి 20: వాకాడు మండలంలో బ్లడ్‌ఫ్లూ లేదని, ప్రజలు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని పశుసంవర్ధకశాఖ అధికారి కృష్ణారావు స్పష్టం చేశారు. వావిళ్లపాళెం, బూడిదలవాగు గ్రామాలను మంగళవారం సందర్శించి పెరటికోళ్లు, ఫౌల్ట్రీ ఫారంలను తనిఖీ చేశారు. బ్లడ్‌ఫ్లూ లక్షణాలు ఎక్కడ లేవన్నారు. ప్రజలు చికెన్, కోడిగుడ్లను నిరభ్యంతరంగా తినవచ్చన్నారు. ఆయన వెంట బాలిరెడ్డిపాళెం పశువైద్యురాలు మంజుల, దుగరాజపట్నం బీఎల్‌వో లక్ష్మీకుమారి, ఏహెచ్ఏ సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

వడ్డికండ్రిగలో భవిష్యత్తుకు గ్యారెంటీ

చిట్టమూరు, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని వడ్డికండ్రిగలో మంగళవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, రషీద్, ఆరూరు గిరినాయుడు, కాపులూరు చెంచురామయ్య, కల్లూరు మణి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 20: మండలంలోని అన్నమేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2015-16లో టెన్త్ చదివిన విద్యార్థులు మంగళవారం పాఠశాలలో కలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురికి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు పద్మనాభం, జ్యోతికుమార్, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, పెంచలయ్య, రమేష్‌బాబు, రాజశేఖర్, మునిశేఖర్, సుబ్బారావు, విద్యార్థులు జయంత్, శివకుమార్, మురళి, రాకేష్, మహేష్, వెంకటేష్, శేష్మ, సంధ్య, చెంచులక్ష్మి, బాసియానా, ముకుందప్రియ తదితరులు పాల్గొన్నారు,

వాటర్ పైపులైన్ లీకేజీ

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 20: పట్టణంలోని 5వ వార్డు 3వ సచివాలయం వద్ద వారం రోజులుగా తాగునీటి పైపు లైను లీకేజీ అవుతోంది. దీంతో పలు వార్డుల్లో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి పైపు లైనుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వరకట్న వేధింపులపై కేసు

బాలాయపల్లి, ఫిబ్రవరి 20: మండలంలోని భైరవరం గ్రామానికి చెందిన ఆరికట్ల సురేఖ తన భర్త ఆరికట్ల వెంకటరమణయ్య వరకట్నం కోసం వేధిస్తున్నాడని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమకు పెళ్లై పదహైదేళ్లు అవుతోందని, కొంతకాలంగా పుట్టింటి నుంచి డబ్బులు తీసుకుని రావాలని వేధిస్తున్నాడని, అంతేకాక తన చెల్లిని రహస్యంగా పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20: నాయుడుపేట పట్టణంలో జువ్వపాలెం వద్ద చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్లే హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్నట్లు రైల్వే ఎస్ఐ కొండప్ప నాయుడు తెలిపారు. మృతుడికి 70 ఏళ్లు ఉంటుందని, పంచె, పింక్ కలర్ చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిపై కొడుకు దాడి

బాలాయపల్లి, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని అలిమిలి గ్రామానికి చెందిన కంటిపల్లి గోపాలయ్యపై ఆయన కొడుకు కంటిపల్లి అమర్‌నాథ్ మంగళవారం కత్తిలో దాడి చేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆస్తి రాసివ్వలేదని దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

చిల్లకూరు, ఫిబ్రవరి 20: మండలంలోని కడివేడు గ్రామానికి చెందిన రేణుక అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రేణుక మూడు రోజులనుంచి కనబడంలేదని, చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం సీసాల స్వాధీనం

చిల్లకూరు, ఫిబ్రవరి 20: మండలంలోని వరగలి గ్రామంలో మంగళవారం అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడు వెంకటకృష్ణయ్యను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అంజిరెడ్డి తెలిపారు.

గూడూరు: మండలంలోని మేగనూరు గ్రామంలో 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఏడుకొండలు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గూడూరు, ఫిబ్రవరి 20: పట్టణంలోని ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లోని పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కాంచన తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలి

కోట, ఫిబ్రవరి 20: వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలని, నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నాగరాజరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం జరిగింది. తహసీల్దారు నాగరాజరావు, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునరావు, ఆర్ఐ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జనార్దన్ బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

మసీదు, ఈద్గా స్థలాలకు రక్షణ కల్పించండి

కోట, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని చిట్టేడులో ఉన్న మసీదు, ఈద్గా స్థలాలను రక్షణ కల్పించాలంటూ ముస్లింలు మంగళవారం తహసీల్దారు నాగరాజరావుకు ఫిర్యాదు చేశారు. పాతికేళ్లగా ప్రభుత్వ స్థలాన్ని ముస్లింలు శ్మశానవాటిక, ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నామని, అయితే కొందరు సదరు భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమ ఆధీనంలో ఉన్న భూమికి రక్షణ కల్పించాలని తహసీల్దారును కోరారు.

433 మందికి 'కల్యాణమస్తు, షాదీ తోఫా'

రూ.3.16కోట్లు జమ: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: జిల్లాలో 'వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా' కింద గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు వివాహం చేసుకున్న 433మంది లబ్ధిదారులకు రూ.3.16కోట్లను జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేసే కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు విడతల్లో కలిపి మొత్తం 2,035మంది లబ్ధిదారులకు రూ.16.86 కోట్లను వారిబ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు వివరించారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ఎమ్మెల్యే సిపాయి సుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారత అధికారి చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు మోపూరులో ఉచిత వైద్యశిబిరం

డక్కిలి, ఫిబ్రవరి 20: మండలంలోని మోపూరు గ్రామంలో కరుణామయి చారిటబుల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం వంటి గంట వరకు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

కోట, ఫిబ్రవరి 20: ప్రస్తుత సీజన్‌లో వ్యవసాయానికి 9 గంటల పాటు విద్యుత్ అందించే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేంద్రరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని విద్యానగర్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇంజనీర్లు, లైన్‌మెన్లతో విద్యుత్ సరఫరా, బకాయిల వసూళ్లపై సమీక్షా సమావేశం జరిగింది. బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏడీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.


దుకాణాల నిర్వహణకు వేలం



వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

చిల్లకూరు, ఫిబ్రవరి 20: మండలంలోని తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతర అనంతరం దుకాణాలు నిర్వహించుకునేందుకు మంగళవారం దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఏప్రిల్ 2నుంచి 5వ తేదీ వరకు ముత్యాలమ్మ జాతర నిర్వహిస్తారు. జాతర ముగిసిన తరువాత నుంచి వచ్చే ఏడాది మళ్లీ జాతర వచ్చే వరకు ఆలయం వద్ద టెంకాయలు, పూజాద్రవ్యాల విక్రయం, కొబ్బరి చెక్కలు, తలనీలాలు సేకరణ, వెయ్యికళ్ల కుండల విక్రయం తదితర దుకాణాల నిర్వహణకు వేలం నిర్వహించగా రూ.41,09,500 ఆదాయం వచ్చిందన్నారు. అదేవిధంగా జాతర సందర్భంగా తలనీలాలు సేకరించేందుకు, గుడిపై భక్తులు వేసే పలు మొక్కులను సంబంధించి రూ.4,78,500 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రసేనమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్నశోభారాణి

ఓజిలి, ఫిబ్రవరి 20: ఓజిలి మండలం కురుగొండ సొసైటీలో మంగళవారం ఛైర్‌పర్సన్ ఉచ్చూరు శోభారాణి అధ్యక్షతన రైతుల సమావేశం నిర్వహించారు. క్రిబ్‌కో ఎరువుల సంస్థ యాజమాన్యం ఆధ్వర్యంలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. 2023-24 సంవత్సరానికి కురుగొండ సొసైటీని దత్తత తీసుకుని వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు క్రిబ్‌కో సంస్థ ప్రతినిధులు తెలిపారు. సొసైటీకి కంప్యూటర్‌ను అందజేశారు. వరి పైరుకు యూరియా మోతాదును తగ్గించి కాంప్లెక్స్ ఎరువులను పెంచడం ద్వారా మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మానమాల పంచాయతీ ఉపసర్పంచి, వైసీపీ సీనియర్ నాయకుడు ఉచ్చూరు హరినాథరెడ్డి, క్రిబ్‌కో మార్కెటింగ్ అధికారి మురళీధర్‌రెడ్డి, సొసైటీ సీఈవో రవీంద్రయ్య, సిబ్బంది కృష్ణయ్య, సాయిదీపిక్, దయాకర్, రజని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండండి

చిట్టమూరు, ఏప్రిల్ 19: ఎన్నికల విధుల్లో బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసశర్మ అన్నారు. మంగళవారం ఆయన బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి పొరపాట్లు జరిగినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీటీలు విజయలక్ష్మి, నిరంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు



స్థానికులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి మురళీధర్

గూడూరు, ఫిబ్రవరి 20: స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మురళీధర్ మాట్లాడుతూ సమాజంలో తారతమ్యాలు లేకుండా అందరికీ న్యాయం అందేలా ప్రతిఒక్కరూ బాధ్యత వ్యవహరించాలన్నారు. కూలీల విషయంలో ఆడ, మగ బేధాలు లేకుండా సమానంగా వేతనాలను అందించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పార్వతయ్య, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.